

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం


05.09.2026
శనివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 67
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రికార్డు సృష్టించిన మెలోని

### 1,413 రోజులు నిరంతరాయంగా అధికారంలో.. మెలోనీకి మోదీ విషెస్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీ రాజకీయ చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా కొనసాగిన ఘనత సాధించిన జార్జియా మెలోనీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు చెప్పారు. మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఆమె సాధించిన ఈ రికార్డు నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ఇటలీ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో జార్జియా మెలోనీ స్నేహం కీలకంగా ఉందని కొనియాడారు. మెలోనీ ప్రభుత్వం వరుసగా 1,413 రోజుల పాటు అధికారంలో కొనసాగి ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం కొనసాగిన ప్రభుత్వంగా రికార్డు సృష్టించింది.

5లో..

## 170 మీటర్ల లోతులో 9 రోజులు

- "మహామంత్రం" జపిస్తూ ప్రాణాలతో
- బయటపడ్డ నేపాల్ కార్మికుడు
- ఆహారం, నీరు లేకుండా జీవనం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్ వరదలు వేయి మందికి పైగా ప్రజల ప్రాణాలను తీశాయి. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. అక్కడక్కడ కొందరు అద్భుతంగా బయటపడుతున్నారు. 9 రోజుల తర్వాత టన్నెల్‌లో చిక్కుకున్న ఇద్దరు హైడ్రో పవర్ కార్మికులు సజీవంగా బయటపడ్డారు. 30 ఏళ్ల సంజయ్ షా వరదలు సంభవించిన నాటి నుంచి టన్నెల్‌లో ఆహారం, నీరు లేకుండా సజీవంగా ఉండటం చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు.

2లో..

# గడువులోగా భవనాలు పూర్తి చేయాలి

- నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి
- ఎంఎన్‌కేఎల్ఐఎస్ టెండర్లు వేగవంతం
- కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్
- పెండింగ్ భూసేకరణ పూర్తి చేయాలి
- పంప్‌హౌస్ పనుల్లో వేగం పెంచాలి
- 2027, 2028లో ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- తండాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించాలి
- వాగుల వద్ద వంతెనలు, కల్వర్టులు నిర్మించాలి





**హైదరాబాద్, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మాణంలోని సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు. అలాగే, దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాడ్‌లో నిర్మాణంలో ఉన్న.. సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు. దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పనులను పరిశీలించనున్నారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన అనంతరం.. నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. రోడ్డుమార్గాన కొడంగల్ చేరుకొని అక్కడే బస చేయనున్నారు. శనివారం కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేయనున్నారు.

2లో..

**టెండర్లు, భూసేకరణ వేగవంతం**

మక్తల్‌నారాయణపేట్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్ 2 పనులకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచడానికి ప్రతి ఏటా అవసరమైన బడ్జెట్‌కు సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు.

**అభివృద్ధి పనులపై హకీంపేట్‌లో సమీక్ష**

కొడంగల్ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై హకీంపేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఎంఎన్ కేఎల్ఐఎస్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా చెప్పారు. నియోజకవర్గంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిని అధికారులు సమావేశంలో వివరించారు. గత సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన సూచనలకు అనుగుణంగా పనుల్లో మక్తల్ నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పంప్ హౌస్ పనులు ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

## ఆ పోస్టుతో మాకు సంబంధం లేదు

- ఆ ప్రచారం నమ్మొద్దు
- నా పేరుతో పోస్టులు వైరల్ అవుతున్నాయి
- ట్విట్టర్‌లో ఖాతాలను పోస్ట్ చేసిన కొండా సురేఖ



**వరంగల్, సెప్టెంబర్ 04, అనంత జనశక్తి న్యూస్**

త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుందని తాను ప్రకటించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి కొండా సురేఖ ఖండించారు. కొండా సురేఖ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాలో ''త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుంది. 'వెయిట్ ఈజ్ ఆల్‌మోస్ట్ ఓవర్'..'' అంటూ ఆసక్తికర పోస్టు వైరల్ అయింది. దీనిపై కొండా సురేఖ స్పందించి.. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.

2లో..

## ఢిల్లీరోడ్లు జలమయం

- ఢిల్లీని కమ్ముకున్న దట్టమైన మేఘాలు
- పట్టపగలే చిమ్మచీకట్లు

2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్**

దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన మేఘాలు కమ్మేశాయి. పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఢిల్లీలో కేంద్ర వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. తీవ్రమైన వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీస్తున్నాయి. భారీ వర్షం కారణంగా జన్మాష్టమి వేడుకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారులపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## కేరళంలో అమృతపురి ఆశ్రమాన్ని సందర్శించిన మంత్రి లోకేశ్



2లో..

మంత్రి నారా లోకేశ్ కేరళంలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమంతో పాటు అందులోని కాళీ దేవాలయాన్ని మంత్రి సందర్శించారు. అనంతరం మాతా అమృతానందమయి ఆశీస్సులు పొందారు. అమృత విశ్వవిద్యాపీఠాన్ని సందర్శించి.. క్యాంపస్‌లోని అమృత ఆయుర్వేద కళాశాలను పరిశీలించారు. అమృతపురి ఆశ్రమంలో లోకేశ్ సుమారు మూడు గంటల పాటు గడిపారు.

## సన్న బియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తాం



- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఫైర్
- ఇల్లు లేని వారికి ఇల్లు ఇవ్వక పోతే..
- సర్పంచ్ పదవి పోతుందని వార్నింగ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్**

సన్న బియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడిసెలో ఉండే ప్రతి ఒక్కరికి ఇప్పుడే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని.. ఇందుకు పార్టీతో పని లేదని.. పేదవారైతే అర్హుడే అని స్పష్టం చేశారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు ఇవ్వక పోతే సర్పంచ్ పదవి పోతుందని చెప్పుకొచ్చారు. అభివృద్ధి పనులను తనకు వదిలేయాలని అన్నారు.

5లో..


## డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు వెళ్తా

- మరణశిక్షపై షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం దేశం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది
- మరణశిక్షపై షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు



2లో..

## వెలిగొండ ప్రాజెక్ట్ క్రెడిట్ వైఎస్సార్‌దే..



- ఎన్టీఆర్ ఉన్నప్పుడే బీజం
- సీపీఐ నారాయణ కామెంట్
- 30 సంవత్సరాల కల నెరవేరింది

2లో..

## దరఖాస్తు దశలోనే రిజెక్ట్ కావాలి.. ఆ వ్యక్తికి ఎస్జీటీ పోస్ట్ ఎలా?

- కర్నూలు టీచర్ అంశం వ్యవహారం
- ప్రభుత్వానికి వైఎస్ జగన్ ప్రశ్నలు
- ఇలాంటి అక్రమాలు ఎన్నో జరిగాయి
- డీఎస్సీ నియామకాలపై సీబీఐతో విచారణ జరిపించాలి



2లో..

## ఆలయాలన్నీ అభివృద్ధి చేస్తాం

### బాసర నుంచి భద్రాచలం వరకు..: మంత్రి పొంగులేటి



2లో..

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 4, అనంత జనశక్తి**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణతో కలిసి ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 25 శాతం పనులే పూర్తవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. మూడు షిఫ్టుల్లో 24 గంటలు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఢిల్లీ రోడ్లు జలమయం

(మొదటి పేజీ తరువాయి)

ఇక ఢిల్లీ ఎయిర్‌పోర్టులోకి నీళ్లు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. 50100 మీటర్ల వరకు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటక 4050 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప ఇళ్లలోంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచించింది. ఇదిలా ఉంటే ఈరోజు జన్మాష్టమి కారణంగా సెలవు కారణంగా రహదారులపై రద్దీ తక్కువగా ఉంది. మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్ వరకు అల్పపీడనం కొనసాగుతోంది. రాజస్థాన్‌లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

### వెలిగొండ ప్రాజెక్ట్
# క్రెడిట్ వైఎస్సార్‌దే..

అమరావతి, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్

పశ్చిమ ప్రకాశం వాసులు 30 ఏళ్లు కలలుగన్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి జాతికి అంకితం చేశారు.నందమూరి తారకరామారావు మొదలు వైఎస్సార్ , చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఈ ప్రాజెక్టు సాగింది. అయితే, పూల సుబ్బయ్య పోరాట ఫలితంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు గురించి సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ తొలిసారి స్పందించారు. ఈ ప్రాజెక్టు కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎక్కువగా కష్టపడ్డారని.. ప్రాజెక్టుల విషయంలో చెప్పుకోవాల్సి వస్తే ఎన్టీఆర్, వైఎస్సార్ మాత్రమే పోరాడారని గుర్తు చేశారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై మీడియా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు విషయాన్ని కూడా సీపీఐ నారాయణ ప్రస్తావించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ముప్పై సంవత్సరాల కల సాకారమైందన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పూల సుబ్బయ్య నాయకత్వంలో వెలిగొండ ప్రాజెక్టు ఒక వినతిపత్రం అందజేశారని నారాయణ గుర్తు చేశారు. ఆ తర్వాత వైఎస్సార్ హయాంలోనే ఎక్కువ శాతం పనులు పూర్తయిన విషయాన్ని వివరించారు. ఈ ప్రాజెక్టుల విషయంలో ఏదైనా చెప్పుకోవాల్సి వస్తే ఎన్టీఆర్, వైఎస్సారే ఎక్కువ కష్టపడ్డారని కొనియాడారు.

ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత మిగతా ముఖ్యమంత్రులు ప్రాజెక్టు విషయంలో పెద్ద చిత్తశుద్ధి వహించలేదన్నారు. చంద్రబాబు నాయుడు చివరికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి ప్రాజెక్టును పూర్తి చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సొరంగం మధ్యలో యంత్రం ఇరుక్కున్నా తీయకుండా హడావుడిగా జాతికి అంకితం చేశారన్నారు. జగన్ తర్వాత మళ్లీ చంద్రబాబు నాయుడు ఆ పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి చేశారని చెప్పారు. మొదటి ఫేజ్ మాత్రమే పూర్తయిందని, వెలిగొండకు ఇంకా మరిన్ని కృష్ణా జలాలు వస్తాయన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం మొదటి ఫేజ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. దాంతో నల్లమల సాగర్‌కు విడుదల చేసిన నీటితో ప్రస్తుతానికి మార్కాపురం జిల్లాలోని పొలాలకు నీటిని అందించనున్నారు. భవిష్యత్‌లో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.

# ఆలయాలన్నీ అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యమైన రాళ్లను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పోలవరం ముప్పుపై కేంద్రానికి వివరిస్తాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే పోలవరం ముంపు ముప్పు తెలంగాణకు పొంచి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణం కంటే 20-25 అడుగుల మేర వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, తెలంగాణలోని ముంపు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి ముంపు సమస్యను వివరిస్తామని తెలిపారు.

### జాతీయ స్థాయిలో పోలీస్ గేమ్స్‌లో
# ఏపీకి మంచి పేరు తేవాలి



డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్

జాతీయ స్థాయిలో పోలీస్ గేమ్స్‌లో ఏపీకి మంచి పేరు తీసుకురావాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అకాడమీలో మెరుగైన శిక్షణ, అవసరమైన పరికరాలు అందిస్తామని తెలిపారు. శుక్రవారం ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ -2026 ముగింపు కార్యక్రమం మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో జరిగింది. ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖ రేంజ్ టీమ్ నిలిచింది. విజేతలకు బహుమతులను డీజీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ పోలీసు స్పోర్ట్స్ అకాడమీ లోగోను ఆవిష్కరించారు.

**వచ్చే ఏడాది మరింత ఉత్సాహంతో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తాం..**

స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం వీఐటీ అమరావతితో అవగాహన ఒప్పందం చేసుకుంది. అనంతరం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మీడియాతో మాట్లాడారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. పతకాలు రాని వారు మరింత సాధన చేయాలని సూచించారు. ర్యాంకులు, పోస్టింగ్‌లు వేరైనా అందరూ ఒకే టీమ్‌గా ఉండాలని నిర్దేశించారు. 'మనది ఏపీ పోలీస్ టీమ్.. మనమంతా ఒకే కుటుంబం' అని వ్యాఖ్యానించారు. శారీరక, మానసిక దృఢత్వం పోలీసులకు ఎంతో ముఖ్యమని వెల్లడించారు. మహిళా పోలీస్ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం మంచి పరిణామమని అన్నారు. వచ్చే ఏడాది మరింత ఉత్సాహంతో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన

అమరావతి, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ డైరెక్టర్ సంబంధిత కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. వార్డుల డిలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు. విశాఖపట్నం , విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ ఆదేశాలు వర్తించనున్నాయి. ఆయా కార్పొరేషన్లు వార్డుల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాల్సి ఉంటుంది.

అభ్యంతరాల స్వీకరణ

కార్పొరేషన్ల నుంచి అందిన వార్డుల పునర్విభజన ప్రతిపాదనలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు కూడా షెడ్యూల్‌లో అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

13న డిలిమిటేషన్ వార్డుల ప్రకటన

అభ్యంతరాల పరిశీలన అనంతరం సెప్టెంబర్ 13న డిలిమిటేషన్ చేసిన వార్డులను ప్రకటించనున్నారు. అనంతరం సెప్టెంబర్ 14న ఏపీ గెజిట్‌లో వార్డుల పునర్విభజన వివరాలను ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు సంబంధించిన తదుపరి చర్యలు కొనసాగనున్నాయి.

**వార్డుల పునర్విభజన షెడ్యూల్**

* సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్లు వార్డుల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలి.
* 5 నుంచి 11 వరకు పునర్విభజన ప్రతిపాదనలపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు.
* 13న డిలిమిటేషన్ చేసిన వార్డులను ప్రకటిస్తారు.
* 14న తుది వార్డుల పునర్విభజన వివరాలను ఏపీ గెజిట్‌లో ప్రచురిస్తారు

# 170 మీటర్ల లోతులో 9 రోజులు

(మొదటి పేజీ తరువాయి)

''ప్రమాదంలో చిక్కుకున్నప్పటి నుంచి తాము మహా మంత్రాన్ని జపిస్తూ దేవుడిని ప్రార్థించాము'' అని చెప్పారు. శుక్రవారం రక్షణ సిబ్బంది బురదతో నిండిన ఒక మార్గం ద్వారా సంజయ్ షానున బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను నేపాల్ ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. బయటకు వచ్చిన తర్వాత హెలికాప్టర్ ద్వారా ఆయనను ఆస్పత్రికి తరలించారు. రెండో వ్యక్తిని కూడా రెస్క్యూ సిబ్బంది కాపాడింది. ప్రాణాలతో బయటపడిన ఇద్దరు వ్యక్తులు కూడా నేపాల్‌కు చెందినవారే. ఆగస్టు 26న చైనానేపాల్ సరిహద్దుల్లోని పర్వత ప్రాంతాల్లో భారీ కొండచరియలు కూలిపోవడంతో ఒక్కసారిగా భోటేకోశి, త్రిశూలి నదులకు వరదలు సంభవించాయి. ఈ వరదల్లో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. 1,280 మంది మరణించగా, 5,500 మందికి పైగా గల్లంతయ్యారు.



ఆ సమయంలో ఎగువ త్రిశూలి3ఏ హైడ్రో పవర్ ప్రాజెక్టులో మెకానికల్ ఫోర్‌మన్‌గా పనిచేస్తున్న సంజయ్ షా టన్నెల్‌లో 170 మీటర్ల లోతులో చిక్కుకుపోయాడు. ప్రమాద హెచ్చరికలు వచ్చిన వెంటనే తాము సురక్షితంగా బయటకు రావడానికి ప్రయత్నించామని, తన సహచరుల్ని వదిలి ఒంటరిగా పారిపోవాలని తనకు అనిపించలేదని చెప్పారు. ఒక్కసారిగా నీరు వేగంగా రావడంతో బయటకు వెళ్లే అన్ని మార్గాలు మూసుకుపోయాయని తెలిపారు. టన్నెల్ చాలా పొడవు ఉండటంతో కొద్దిసేపటికే అందరూ లోపల చిక్కుకుపోయారని, ఆ తర్వాత వారి పరిస్థితి ఎలా ఉంది.? అని తెలుసుకోవడం కష్టంగా మారిందని అన్నారు. 9 రోజుల తర్వాత సురక్షితంగా బయటపడటంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఇది తనకు పునర్జన్మ అని చెప్పారు.

**టన్నెల్‌లో ఆక్సిజన్ ఉండటంతో..**

రెస్క్యూ ఆపరేషన్ చేసిన నిపుణుల ప్రకారం.. సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన టన్నెల్‌లో స్థిరమైన గాలి, ఆక్సిజన్ ఉండటం వల్లే వారు శ్వాసించవచ్చని భావిస్తున్నారు. నేపాల్ రక్షక సిబ్బందికి భారత్, చైనా, దక్షిణ కొరియాకు చెందిన నిపుణులు కూడా సహాయం అందిస్తున్నారు. హైడ్రోపవర్ టన్నెల్స్‌లో చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్న ఇతర కార్మికుల కోసం గాలింపు కొనసాగుతోంది.

# ఆ పోస్టుతో మాకు సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)

''వివిధ సోషల్ మీడియా వేదికల్లో నా పేరుతో ప్రసారమవుతున్న పోస్టులతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మీడియా ప్రతినిధులు, ప్రజలు కేవలం అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతున్నాం'' అని పోస్టు చేశారు.

కొండా సురేఖ బర్తరఫ్ అంశం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఆమె బర్తరఫ్‌కు కాంగ్రెస్ అధిష్టానం ఆమోద ముద్ర వేయగా.. సిఫారసు లేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌కు కూడా పంపించారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ గవర్నర్ పేరుతో గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.

ఈ సమయంలోనే కొండా సురేఖ అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి 'ది వెయిట్ ఈజ్ ఆల్మోస్ట్



ఓవర్. ఏ బిగ్ అప్డేట్ కమింగ్ సూన్. స్టే ట్యూన్ తెలంగాణ' అంటూ పోస్ట్ వెలువడటంతో అందరూ ఆ పోస్ట్ నిజంగానే కొండా సురేఖ చేశారనే అనుకున్నారు. న్యూస్ వెబ్‌సైట్స్, ఛానల్స్‌లో కూడా ఆ వార్త వైరల్ కావడంతో ఆమె తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీడియా మిత్రులకు నమస్కారం.. వివిధ సోషల్ మీడియా వేదికల్లో మా పేరుతో ప్రచారమవుతున్న వార్తలతో గానీ, పోస్టులతో గానీ మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాం. మా అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను కింద జతపరిచాము. మీడియా మిత్రులు మరియు ప్రజలు కేవలం ఈ అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాల్సిందిగా కోరుతున్నాము" అంటూ ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు.

# డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు వెళ్తా

ఢాకా, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే ప్రణాళికపై మరోసారి స్పందించారు. తనపై నమోదైన కేసుల్లో ఒకదానిలో మరణశిక్ష విధించినప్పటికీ.. డిసెంబర్ నాటికి బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి కోర్టులను ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందన్నారు. ఈ సమయంలో ప్రజల పక్కన నిలబడేందుకే స్వదేశానికి తిరిగి వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు. చట్టాన్ని ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. అయితే విచారణ నిష్పక్షపాతంగా జరగాలని స్పష్టం చేశారు. ముందే నిర్ణయించిన తీర్పు ఆధారంగా విచారణ కొనసాగడం న్యాయం కాదని వ్యాఖ్యానించారు. స్వదేశానికి తిరిగి వశ్తే ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని హసీనా అంగీకరించారు. అయితే భయం కారణంగా తన బాధ్యత నుంచి వెనక్కి తగ్గబోనని తెలిపారు.

దాదాపు రెండేళ్లుగా భారత్‌లో ఉన్న సమయంలో తన పార్టీ అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులను అధికారులు రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం లేదా బీఎన్‌పీతో తాను రహస్యంగా ఎలాంటి అవగాహనకు రాలేదని స్పష్టం చేశారు. తాను తిరిగి రావాలనుకోవడం అధికా



రాన్ని తిరిగి పొందేందుకేమీ కాదని హసీనా తెలిపారు. తన మద్దతుదారుల ప్రజాస్వామ్య, రాజకీయ హక్కులను కాపాడటం, దేశ భవిష్యత్తును బంగ్లాదేశ్ ప్రజలే నిర్ణయించుకునే అవకాశం కల్పించడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఏడాది చివరి నాటికి బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాలన్న నిర్ణయం తన మాతృదేశం పట్ల ఉన్న బాధ్యత భావన నుంచి తీసుకున్నదని హసీనా చెప్పారు. ''బంగ్లాదేశ్ నా దేశం. నా రాజకీయ జీవితమంతా బంగ్లాదేశ్ ప్రజలతోనే గడిపాను. నా తల్లి, నా సోదరులు, నా కుటుంబంలోని చాలా మంది సభ్యులు బంగ్లాదేశ్ గడ్డపైనే హత్యకు గురయ్యారు. నా రాజకీయ జీవితమంతా ఆ దేశానికి సేవ చేస్తూనే గడిపాను. నా మూలాలు అక్కడే ఉన్నాయి. నా ప్రజలు అక్కడే ఉన్నారు. నా బాధ్యత కూడా అక్కడే ఉంది'' అని ఆమె గుర్తు చేశారు. తాను ఎదుర్కొన్న జైలు జీవితం, వేధింపులు, హత్యాయత్నాలు, పదేపదే వచ్చిన బెదిరింపులను గుర్తుచేసుకున్న హసీనా.. దేశం తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో దూరంగా ఉండేందుకు తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు.

తన తిరుగు ప్రయాణం అధికారాన్ని తిరిగి దక్కించుకోవడం కోసం కాదని, తన బాధ్యతను నెరవేర్చడం, ప్రజలతో నిలబడటం, చట్టాన్ని ఎదుర్కోవడం, తనపై తీర్పును బంగ్లాదేశ్ ప్రజలకే వదిలేయడమేనని హసీనా తెలిపారు. తనను బంగ్లాదేశ్‌కు అప్పగించే విషయంలో భారత ప్రభుత్వం వైఖరిపై తాను వ్యాఖ్యానించబోనని హసీనా చెప్పారు. ''భారత్ సార్వభౌమ దేశం. భారత ప్రభుత్వం తరపున నేను మాట్లాడను. నా అవగాహన ప్రకారం.. భారత్ అప్పగింత అంశాన్ని చట్టపరమైన వ్యవహారంగా చూస్తోంది. తన సొంత న్యాయ, న్యాయవ్యవస్థ ప్రక్రియల ద్వారా దీనిని పరిష్కరిస్తోంది. దాన్ని భారత్ చూసుకుంటుంది'' అని అన్నారు. భారత్‌బంగ్లాదేశ్ స్నేహ సంబంధాలకు తాను ఎప్పుడూ విలువ ఇస్తానని చెప్పారు.

**తిరిగి వస్తే ప్రాణహాని ముప్పు?**

బంగ్లాదేశ్‌కు తిరిగి రావడంలో ఉన్న ప్రమాదాలను హసీనా అంగీకరించారు. అయితే భయం తన బాధ్యతను నిర్ణయించలేదని చెప్పారు. తనపై 19 సార్లు హత్యాయత్నాలు జరిగాయని ఆరోపించారు. తన కుటుంబ సభ్యుల హత్యలను గుర్తుచేసిన హసీనా.. 2004 ఆగస్టులో జరిగిన గ్రెనేడ్ దాడి తనను, అవామీ లీగ్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నదని పేర్కొన్నారు. ''నేను జైలు జీవితం, సైనిక పాలన, రాజకీయ వేధింపులు, పదేపదే వచ్చిన బెదిరింపులను ఎదుర్కొన్నాను. కాబట్టి ప్రమాదం ఏంటో నాకు తెలుసు. కానీ రాజకీయ జీవితంలో వ్యక్తిగత భద్రత ఒక్కటే పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం కాదు. నా ప్రజలకు దూరంగా జీవించడం కంటే.. నా దేశానికి తిరిగి వెళ్లి ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికే నేను సిద్ధంగా ఉన్నాను'' అని హసీనా అన్నారు.

### దరఖాస్తు దశలోనే రిజెక్ట్ కావాలి..
# ఆ వ్యక్తికి ఎస్జీటీ పోస్ట్ ఎలా?

అమరావతి, సెప్టెంబర్ 04, అనంతజనశక్తి న్యూస్

కర్నూలు జిల్లాలో ఓ వ్యక్తికి టెట్ అర్హత లేకుండానే స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ టీచర్ పోస్ట్ ఇచ్చారనే వ్యవహారం ఏపీలో కలకలం రేపుతోంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి కూడా విచారణ జరపారని.. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కర్నూలు టీచర్ అంశంపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. దరఖాస్తు దశలోనే తిరస్కరణకు గురికావాల్సిన వ్యక్తికి ఎస్‌జీటీ పోస్టు ఎలా ఇచ్చారంటూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

మెగా డీఎస్సీలో అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారంటూ సాక్ష్యాలు వెలుగులోకి వస్తున్నా కూడా..ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించడం లేదని జగన్ విమర్శించారు. సీబీఐ విచారణకు ఇవ్వకుండా ఇంకెన్నాళ్లు తప్పించుకుంటారని.. ఇంకెన్నాళ్లు యువకులను మోసం చేస్తారని ప్రశ్నించారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేత రాజీనామా చేయించకుండా.. అబద్ధాలుచెప్తూ, పబ్లిసిటీ చేస్తూ చంద్రబాబు తన కుమారుణ్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు.

**కర్నూలు జిల్లాలో ఒక అభ్యర్థికి తన కేటగిరీ ప్రకారం టెట్‌లో 75 మార్కులు రావాల్సి ఉందని.. అయితే 65 మార్కులే వచ్చినప్పటికీ అతనికి స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ పోస్టు ఎలా ఇచ్చారని జగన్ ప్రశ్నించారు. ఒన్-టు-ఒన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి మరీ, అర్హత లేదని తెలిసి కూడా, పోస్టు ఎలా ఇచ్చారని వైఎస్ జగన్ నిలదీశారు. దరఖాస్తు దశలోనే రిజెక్ట్ కావాల్సిన వ్యక్తి, ఆ తర్వాత దశలు కూడా దాటి ఉద్యోగం ఎలా పొందగలిగాడని ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. అనేక జిల్లాల్లో డీఎస్సీ–2025లో ఇలాంటి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న వైఎస్ జగన్.. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌పై సీబీఐ విచారణ చేయించాలని మరోసారి డిమాండ్ చేశారు. నిజాయితీపరులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా కోర్టులోనూ పోరాడుతున్నామని తెలిపారు.**

**మరోవైపు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫైనాన్స్ క్లియరెన్స్ పొందిన అటవీశాఖలోని 814 ఉద్యోగాలకు, నోటిఫికేషన్లు జారీ చేసి, మెయిన్స్ పరీక్షలు పూర్తయ్యాయన్న వైఎస్ జగన్.. అందులోని 40 స్పోర్ట్స్ కోటా పోస్టులను పరీక్ష లేకుండా, సర్టిఫికెట్ల ఆధారంగా భర్తీ చేసేందుకు జీవో నంబర్-4 వాడిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలు బయటపడగానే.. ఈ రిక్రూట్‌మెంట్‌ను మధ్యలో ఆపేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీ వ్యవహారాన్ని, జీవో నంబర్ 4 ఆధారంగా నడిచిన నియామకాలన్నింటినీ సీబీఐకి అప్పగించాలంటూ ఏపీ ప్రభుత్వాన్ని జగన్ మరోసారి డిమాండ్ చేశారు.**

# గడువులోగా భవనాలు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు పూర్తికి లక్ష్యాల ఖరారు

ప్రాజెక్టు ఫేజ్ 1 పనులను డిసెంబర్ 2027 నాటికి, ఫేజ్ 2 పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు.

**ఆర్ అండ్ బి పనుల్లో వేగం పెంచాలి**

కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని రోడ్డు భవనాల పనుల పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ కనెక్టివిటీ, భవన నిర్మాణాలు, బ్రిడ్జీలు, ఇతర నిర్మాణాల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**తండాలకు రోడ్లు, వంతెనల నిర్మాణం**

నియోజకవర్గంలో ప్రతి తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని, తండాలకు రోడ్డు నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో వాగుల వద్ద కల్వర్టులు, వంతెనల నిర్మాణానికి పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలని, చెక్‌డ్యామ్ తరహాలో వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణం ఉండేలా డిజైన్లు రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.



# విద్యార్థులపై బీసీఐకి ఆ అధికారం లేదు



న్యాయ విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించే అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కు గానీ, రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు గానీ లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. విద్యా సంస్థలే తమ నిబంధనల అనుసారంగా న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకోవచ్చని కోర్టు తెలిపింది. నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాల్గొనాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించిన ఆ వర్సిటీ విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా క్రమశిక్షణ చర్య తీసుకోవడం వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ఈ విషయంలో బీసీఐకి ఉన్న పరిమితుల్ని వెల్లడించింది.

**జాతీయ రహదారుల వెంబడి పార్కింగ్ నివారణకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేయండి**

ఆక్రమణలు, అక్రమంగా నిలిపివున్న వాహనాల కారణంగా జాతీయ రహదారులపై ప్రమాదాలు పెచ్చుమీరడాన్ని సుప్రీంకోర్టు గురువారం ఎత్తిచూపింది. ఈ ముప్పును నివారించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఒక నిఘా కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసి టోల్‌ప్లాజాల నుంచి ఆ వ్యవస్థను ఎందుకు పరిశీలించకూడదని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. రాజస్థాన్‌లోని ఫాలోదీ ప్రాంతంలో జాతీయ రహదారిపై నిలిచివున్న ట్రైలర్ ట్రక్కును ఒక టెంపో ట్రావెలర్ ఢీకొన్న కారణంగా 15 మంది ప్రాణాలు కోల్పోవడంపై సుప్రీంకోర్టు తనంత తానుగా విచారణ చేపట్టింది. జాతీయ రహదారులపై ఆక్రమణలు, నిలిచి వున్న వాహనాలు ప్రధాన సమస్యలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది.

## ఆ విమానంలో హైడ్రాలిక్ వ్యవస్థలు ఫెయిల్..
# పైలట్ 'డ్రగ్స్'కు సంబంధముందా?

థాయ్‌లాండ్ నుంచి దిల్లీ బయల్దేరిన ఎయిరిండియా విమానం ఇటీవల తీవ్ర కుదుపులకు లోనయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఆ విమానంలో మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలం కావడంతో ప్రయాణికులు గాయపడ్డారు. అంతేగాక, పైలట్ డ్రగ్స్ వాడినట్లు గుర్తించారు. AAIB వివరాల ప్రకారం.. ఆగస్టు 4న 145 మందితో పుకెట్ నుంచి దిల్లీకి బయల్దేరిన ఈ విమానం 36,000 అడుగుల ఎత్తులో ఉండగా.. దాదాపు ఒకేసారి మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు పనిచేయడం ఆగిపోయాయి. దాంతో ఆటోపైలట్ వ్యవస్థ డిస్‌కనెక్ట్ అయి, విమానం వేల అడుగుల




ఎత్తు నుంచి అకస్మాత్తుగా కిందికి దిగివచ్చింది. ఈ ఘటనలో 24 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఆ వెంటనే హైడ్రాలిక్ వ్యవస్థలు తిరిగి పనిచేయడంతో విమానం దిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటన సమయంలో ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు కనిపించలేదని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది.
మరోవైపు విమానం ల్యాండ్ అయిన తర్వాత పైలట్‌ను పరీక్షించగా అతడు నిషేధిత సైకోయాక్టివ్ పదార్థం వాడినట్లు వెల్లడైంది. ల్యాబ్ టెస్టుల్లోనూ దాన్ని నిర్ధరించారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఆ పదార్థాల వినియోగాన్ని నివారించేలా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైడ్రాలిక్ వ్యవస్థ వైఫల్యానికి, పైలట్ ప్రవర్తనకు ఏమైనా సంబంధం ఉందా? అనే విషయంపై మాత్రం దర్యాప్తు నివేదిక స్పష్టతనివ్వలేదు. సాంకేతిక అంశాల్లో ఇంకా తమ దర్యాప్తు కొనసాగుతోందని ఏఏఐబీ చెప్పింది. తుది నివేదికలో పూర్తి వివరాలు బయటకు రానున్నాయి.

## పార్క్ చేస్తుండగా..
# స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

విమానాశ్రయంలో పార్క్ చేస్తుండగా ఇండిగో విమానం స్తంభాన్ని ఢీకొట్టింది. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. నవీ ముంబయి నుంచి ఈ విమానం శ్రీనగర్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. రన్‌వేపై ల్యాండ్ అయిన తర్వాత పార్కింగ్ ఏరియాకు వెళ్తుండగా.. అదుపుతప్పి విజువల్ డాకింగ్ గైడెన్స్ సిస్టమ్ ఉన్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విమానం ముందు భాగం కొంతమేర ధ్వంసమయ్యింది. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని పేర్కొన్నారు. ఘటనపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా దర్యాప్తు చేపట్టింది.







## ప్రభుత్వోద్యోగులకు సోషల్ మీడియా
# ప్రవర్తనా నియమావళి?

ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో రీళ్లు, వీడియోలు, వ్యక్తిగత అభిప్రాయాలు విరివిగా పోస్ట్ చేస్తున్న ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనను నియంత్రించడం కోసం కేంద్ర ప్రభుత్వం మార్గనిర్దేశకాలు రూపొందించనున్నట్టు తెలుస్తోంది. ఈ అంశంపై అత్యున్నత స్థాయిలో చర్చ జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. సోషల్ మీడియా వేదికల్లో అనుచిత అంశాలపై వీడియోలు, వ్యక్తిగత అభిప్రాయాలు పోస్టు చేస్తున్నవారిని కట్టడి చేసేందుకు ఈ ప్రవర్తనా నియమావళి దోహదపడుతుందని వివరించాయి. అందరు అధికారులకూ, ఉద్యోగులకూ వర్తించేలా ఈ నియమాలను రూపొందించనున్నారు. అయితే వాటిని ఎప్పుడు ప్రకటిస్తారు, అందులోని మార్గదర్శకాలు ఎలా ఉంటాయన్నది తెలియలేదు. తమ పనిని, హోదాను గొప్పగా చూపుతూ అధికారులు సోషల్ మీడియా పోస్టులు పెట్టే ప్రవృత్తి పెరిగిపోతుండటం ఇందుకు దారితీసినట్టు వర్గాలు వివరించాయి. ప్రభుత్వ అధికారులు తమ పనిని తామే చిలువలు పలువలుగా చూపడం ఉద్యోగ నియమాలకు విరుద్ధమని తెలిపాయి. ప్రస్తుతం ప్రభుత్వోద్యోగుల కోసం సోషల్ మీడియా సంబంధ ప్రవర్తనా నియమావళి ఏదీ అమలులో లేకపోవడం కూడా నియమాల రూపకల్పన అవసరాన్ని చాటుతోందని అధికారులు పేర్కొన్నారు.

# స్టార్ జాగిలం లెక్కల్లోనూ స్టారే

రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి వీవీఐపీల పర్యటనల్లో పలుమార్లు పేలుడు పదార్థాలను పసిగట్టిన 'అర్జునన్'కు పదేళ్లు నిండాయి. కేరళంలోని కొల్లం జిల్లా కొట్టారాక్కర గ్రామీణ ఎస్పీ కార్యాలయంలో ఈ పోలీసు జాగిలం పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేయగా.. గ్రామీణ ఎస్పీ షాజీ సుగునన్ కేకు కట్ చేశారు. 'అర్జునన్' సెల్యూట్ చేసి కేకు అందుకొంది. పలువురు ఉన్నతాధికారులు పాల్గొని అభినందనలు తెలిపారు. లాబ్రడార్ జాతికి చెందిన ఈ జాగిలం (నంబర్ 284) కొల్లం రూరల్ పోలీస్ కే9 స్క్వాడులో చాలా కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. పేలుడు పదార్థాలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన అర్జునన్ సాధారణ గణిత పరిజ్ఞానంలోనూ ఆరితేరింది. 3+3 ఎంత అంటే.. ఆరుసార్లు మొరుగుతుంది. 4 - 4 ఎంత అంటే.. సున్నా అని సూచిస్తూ మౌనంగా ఉండిపోతుంది.

## అనువంశిక చర్మవ్యాధితో
# ఆధార్ కార్డుకు తిప్పలు

ప్రతి పౌరుడికీ చదువూ సంధ్యల నుంచీ ప్రభుత్వ పథకాలకు, బ్యాంకింగు సేవలకు.. అన్నింటికీ నేటి రోజుల్లో ఆధార్‌కార్డు కీలకమైన గుర్తింపు పత్రం. ఒడిశాలోని సంబల్‌పుర్‌కు చెందిన తండ్రీకొడుకులకు అనువంశిక చర్మవ్యాధి కారణంగా చేతులపై రేఖలు కనిపించక బయోమెట్రిక్ నమోదు కావడం లేదు. దీంతో వీరిద్దరికీ ఆధార్‌కార్డు పొందడం పెద్ద సవాలుగా మారింది. నగరంలోని సఖిపడ ఈద్గా సమీపాన ప్రభుత్వ స్థలంలో టిన్ షెడ్డు వేసుకొని జీవిస్తున్న సమీర్‌ఖాన్ (40) రహదారి నిర్మాణపనుల్లో తారు కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు అరచేతుల్లో చర్మ సమస్య ఉండటంతో ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆధార్‌కార్డు లభించలేదు. పదేళ్ల కుమారుడు ముజాహిద్ ఖాన్‌కూ ఇదే పరిస్థితి ఎదురైంది. పేదరికంలో ఉన్నప్పటికీ ఆధార్ లేనందున పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందలేకపోతున్నామని సమీర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాధిని 'పామోప్లాంటర్ కెరటోడెర్మా' అంటారని సంబల్‌పుర్‌కు చెందిన చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ తన్మయ్ పాధి తెలిపారు. దీనికి శాశ్వత నివారణ చికిత్స ప్రస్తుతానికి లేదన్నారు. ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్ సిద్ధేశ్వర్ బలిరామ్ బొండర్ దృష్టికి వెళ్లడంతో బాధితుల ఆధార్ నమోదుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారిని ఆదేశించారు.



## న్యాయపోరాటం చేయను..
## మరణశిక్ష విధించండి: యాసిన్ మాలిక్



కశ్మీరీ పండిత్ మహిళ సరళా భట్ హత్య కేసులో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, తాను నిందితుడిని కాదని నిషేధిత జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ చీఫ్ మహమ్మద్ యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. అయితే, ఈ కేసులో న్యాయపోరాటం చేయబోనని, బదులుగా తనకు మరణశిక్ష విధించాలంటూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. అదే సమయంలో భార్యతో వివాహ బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటించాడు. యాసిన్ మాలిక్ ప్రస్తుతం దిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నాడు.

## చెరువులో దాక్కున్న దొంగ..
## సినీ ఫక్కీలో పోలీసుల ఛేజింగ్



దొంగతనం తదితర కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న ఓ నిందితుడు అరెస్టు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రావడాన్ని గమనించి ఓ చెరువులోకి దూకాడు. వెనక్కి తగ్గని పోలీసులు సినీ ఫక్కీలో అతడిని వెంటాడారు. చెరువులోకి దిగి మరీ అతడిని పట్టుకొచ్చిన ఘటన కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో చోటుచేసుకుంది.
పోలీసుల వివరాల ప్రకారం.. దిలీప్ అలియాస్ కారియాపై భద్రావతి నగరంలో వివిధ పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయి. బెయిల్‌పై బయట ఉన్న అతడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడిని అరెస్టు చేయాలని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు ఆపరేషన్ చేపట్టారు. అతడి ఆచూకీ తెలుసుకొని పట్టుకునేందుకు వెళ్లగా నిందితుడు తప్పించుకొని ఓ చెరువులో దూకాడు. గడ్డి మాటున అరగంటకుపైగా దాక్కున్నాడు. దీంతో చెరువులోకి దిగిన పోలీసులు నిందితుడిని బయటకు తీసుకొచ్చారు.

# హేపీ బర్త్‌డే బసంతీ!




ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లా బడగావ్ గ్రామానికి చెందిన రాజేశ్‌కుమార్ వర్మ మంగళవారం రాత్రి తన ఇంట పుట్టినరోజు పార్టీ ఉందని గ్రామస్థులందరినీ ఆహ్వానించాడు. రంగురంగుల బెలూన్లతో ఇంటిని అలంకరించి, రెండు కేకులను సిద్ధం చేశాడు. మెడలో పూలదండ, నెత్తిన ప్రత్యేక క్యాప్‌తో 'బసంతి' కదలివచ్చింది. రాజేశ్ ముద్దుగా పెంచుకొంటున్న గేదె 'బసంతి' నాలుగో పుట్టినరోజు వేడుక అది. కేకు కట్ చేయగానే గ్రామస్థులు అందరూ కరతాళ ధ్వనులు చేస్తూ 'హేపీ బర్త్‌డే బసంతీ' అని పాడారు. ముందుగా బసంతికి కేకు, అరటిపండ్లు పెట్టాక.. గ్రామస్థులు అందరికీ కేకు పంచిపెట్టారు. ''ఈ గేదె నా కుటుంబంలో భాగం. అందుకే నా ప్రేమను ఇలా ప్రత్యేకంగా చూపాలనుకున్నాను'' అంటూ ఈ సందర్భంగా రాజేశ్ చేసిన వ్యాఖ్యలతో ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# శ్రీరాముడి దయ వల్లే...

**- అయోధ్య కొత్త సీఈవో జితేంద్ర మిశ్ర వ్యాఖ్య**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు తొలి సీఈవోగా నియమితులైన విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర.. అయోధ్య చేరుకొని ట్రస్టు సభ్యులు, ఆఫీస్ బేరర్లతో గురువారం సమావేశమయ్యారు. ట్రస్టు పని చేసే తీరు, అకౌంటింగ్, పరిపాలనాపరమైన ఏర్పాట్ల వంటి అంశాలన్నింటినీ వారు ఆయనకు వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మిశ్ర.. ఇది పరిచయ సమావేశం మాత్రమేనని చెప్పారు. తన పాత్ర, విధుల గురించి సంపూర్ణంగా అర్థం చేసుకునేందుకు మరికొన్ని రోజులు పడుతుందని పేర్కొన్నారు. శ్రీరాముడి దీవెనల వల్లే ట్రస్టు సీఈవోగా తాను ఎంపికైనట్లు భావిస్తున్నానని తెలిపారు. మిశ్ర సీఈవోగా ఇంకా లాంఛనప్రాయంగా బాధ్యతలు చేపట్టలేదు. రాబోయే రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.






# 'తెలుగు తక్కువ' తరానికి దారేది?

ఏడాదికి రెండుసార్లు.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఆర్నెల్లకోసారి మనకు తెలుగు భాష గుర్తొస్తుంది. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం, ఇంకో ఆర్నెల్లకు ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా భాష గురించి మాట్లాడుకుంటాం. తెలంగాణ ఏర్పడిన తరువాత సెప్టెంబర్ 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. ఏమైనా, భాష గురించి ఈ రోజుల్లో చర్చించుకోవటానికైనా ఈ 'దినోత్సవాలు' పనికొస్తున్నాయి. తెలుగు భాషకు ఇంగ్లీష్ వల్ల పెనుప్రమాదం వచ్చిందని ఈ సందర్భంగా ఉపన్యాసాలు ఇవ్వటం, అందులో మీడియా భాష మీద నాలుగు రాళ్ళేసి వెళ్ళటం క్రమం తప్పకుండా జరుగుతోంది.

వాడుక భాషలో ఇంగ్లీష్ మాటలు ఎక్కువగా వస్తున్నాయనే విమర్శ ఉన్నమాట నిజం. ఇంగ్లీష్ మీడియం చదువులు ఒకవైపు, మీడియాలో అనవసరపు ఇంగ్లీష్ మాటల వాడకం ఇంకోవైపు ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తూ వస్తున్నాయి. అయితే, సంస్కృతం వాడకం సంగతేంటి? 'జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు' అనే మాట నిజమే అయినా, ఇంకా ఎంత కాలం అదే సంస్కృతంతో తెలుగుకి దూరమవుదాం? 'వాడుక భాష' అనకుండా 'వ్యావహారిక భాష' అనటంలోనే మనకున్న సంస్కృత ప్రేమ అర్థమవుతోంది. ఏదైనా ఒక ఇంగ్లీష్ మాట వస్తే దాన్ని తెలుగులో చెప్పాలనుకున్నప్పుడు మనం సంస్కృతాన్ని ఆశ్రయిస్తున్నాం.

మీడియాలో ఇప్పటికీ అదే జరుగుతోంది. మొబైల్ ఫోన్‌ను చరవాణి అని, ఇంటర్నెట్‌ను అంతర్జాలం అని రాస్తున్నాయి. కేవలం ఇంగ్లీష్ వాడకూడదనే అభిప్రాయంతోనే ఇలాంటి అనువాదాలకు దిగుతున్నట్టు ఉంది తప్ప సామాన్యులకు అర్థం కావాలన్న అభిప్రాయం ఉన్నట్టు కనబడడం లేదు. పైగా, ఎక్కువమంది మెచ్చి ఆహ్వానించి వాడటం మొదలుపెట్టినప్పడే ఇలాంటి మాటలకు సార్వజనీనత వస్తుంది. ఔటర్ రింగ్ రోడ్‌ను బాహ్య వలయ రహదారి అని అనువదించటం వల్ల ఒరిగేదేమీలేదు. ఇంకా వీలైతే 'చుట్టుదారి' లాంటి మాట అయితే జనం అర్థం చేసుకుంటారు.

సామాన్య జనం 'ఇళ్ళు కడతారు'. మీడియా వాళ్ళు మాత్రం 'గృహాలు నిర్మిస్తారు'. జనం కొత్త బట్టలు వేసుకుంటారు. కానీ మీడియా రాతల్లో మాత్రం 'నూతన వస్త్రాలు ధరిస్తారు'. అసలు ఏ మాత్రమూ ఆలోచించకుండానే మీడియాలో చాలా సందర్భాలలో 'నూతన' అని వాడుతున్నారు తప్ప జనం మాటల్లో వాడే 'కొత్త' జోలికి పోవటం లేదు. 'అనంతరం' బాగుంటుంది గాని తరువాత నచ్చదెందుకో? జనం 'ఒప్పకుంటారు' గాని మీడియా వాళ్ళు మాత్రం 'అంగీకరిస్తారు'. 'పుట్టారు' బదులు 'జన్మించారు' అంటారు. 'వాడకం' బదులు వినియోగం అంటేనే తృప్తిగా ఉంటోంది. కోప్పడ్డారు' బదులు 'ఆగ్రహించారు' అని వాడాల్సిన అవసరం ఏమొచ్చింది? గెలిచారు అనటానికి బదులు విజయం సాధించారు అని, అమ్మకం బదులు విక్రయం అని, ఓడినవాళ్లను పరాజితులు అని, 'మెచ్చుకున్నారు' బదులు 'అభినందించారు' అని, ఎగతాళి బదులు అపహాస్యం అని, పుకార్లు బదులు వదంతులు అని రాయటం, చెప్పటం నిజం కాదా? మనం రాసేటప్పడు ఆ మాట సామాన్య జనం వాడుతున్నదా, కాదా అనేది ఒక్క క్షణమైనా ఆలోచిస్తున్నామా?

తరచూ తెలుగుభాష గురించి ఆవేదన వెళ్లగక్కే ఒక ఆచార్యులవారు ఈ మధ్యనే తన అనుభవాన్ని పంచుకున్నారు. చాలా పెద్ద చికిత్సాలయానికి వెళ్ళి 'దంతవైద్యునితో కలిసేది ఉంది' అని అక్కడున్న మహిళతో అంటే ఆమె ఏగాదిగా చూసిందట. 'డెంటిస్ట్ అపాయింట్‌మెంట్ ఉంది' అన్నప్పడు ఆమెకు అర్థమైందట. ఈ పరిస్థితికి తెలుగు వాళ్ళందరినీ సిగ్గుపడవలసిందిగా కోరతున్నారాయన. దంత వైద్యుడనే సంస్కృతం జోలికి పోకుండా, దుష్టసమాసమంటూ చాదస్తానికి పోకుండా 'పళ్ల డాక్టర్' అని అడిగి ఉంటే సరిపోయేది.

జనం నోళ్లలో నానే 'బడి'ని 'పాఠశాల' చేసి అదే రుద్దాలని చూడటం వల్ల చివరికి 'స్కూలు' స్థిరపడిపోయింది. 'పై చదువులకు' అని జనం మాట్లాడుకుంటూ ఉంటే మీడియా మాత్రం 'ఉన్నత విద్యాభ్యాసం కోసం' నుంచి దిగిరాలేదు. ఈలోగా 'హయ్యర్ స్టడీస్' అని మాట్లాడే తరం వచ్చేసింది. అతిగా ఇంగ్లీష్ వాడవద్దని చెప్పాలి తప్ప చీటికి మాటికి సంస్కృతాన్ని ఆశ్రయించటం తగ్గించుకోమని ఎవరైనా చెప్పినా సంస్కృత ప్రేమికులకు కోపమొస్తుంది. వందల ఏళ్లనాటి పరాయిభాష కంటే వేల ఏళ్ల నాటి మన సంస్కృతం మెరుగు అనేది వీళ్ళ సమాధానం.

ఒకప్పటి గ్రాంథికం నుంచి ఇప్పడున్న స్థాయికి రావటానికి అవిశ్రాంత పోరాటం జరిపి, వ్యావహారిక భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళినవాడు గిడుగు రామమూర్తి. కొంతమంది పండితులు ఆయన వాదనతో ఏకీభవించి సరళ గ్రాంథికంలో రచనలు మొదలుపెట్టారు. ఆ తరువాత పత్రికలు కూడా అదే బాట పట్టాయి. తాపీ ధర్మారావు లాంటివాళ్లు చొరవతీసుకున్నారు. శిష్టవ్యావహారికంలో రాయటం మొదలుపెట్టారు. 'వారు పరమపదంబు జెందె' నుంచి 'వారు పరమపదించారు' దాకా తీసుకురాగలిగారు. ఆ తరువాత తరాల్లో మరింత సరళమై 'వారు చనిపోయారు' దాకా రావటం చూస్తున్నాం.

గిడుగు తరువాత కూడా వ్యావహారిక భాష మీద మరింత ఆలోచన జరిగింది. 1970లలో కూడా యూనివర్సిటీల పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే ఉండటం మీద చర్చ మొదలైంది. ప్రభుత్వ కార్యకలాపాలు, యూనివర్సిటీ పరీక్షలు, పరిశోధనాపత్రాలు శిష్టవ్యావహారికంలో అనుమతించాలంటూ 1971లో ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానం ఒక చరిత్రాత్మక ఘట్టం. దీనిమీద 11 మందితో ఏర్పాటైన కమిటీ ఐదు సమావేశాలు జరిపింది. ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల పరిధిలోని ఎనిమిది మంది, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ఏడుగురు సాహిత్య, పాత్రికేయ ప్రముఖుల అభిప్రాయాలు సేకరించారు. ఆ విధంగా రూపొందించి ఇచ్చిన నివేదిక ఆధారంగా శిష్టవ్యావహారానికి ఆమోద ముద్ర పడి యాభై ఏళ్ళు గడిచాయి.

ఈ యాభై ఏళ్ళలో భాష వాడకంలో చాలా మార్పులొచ్చాయి. రచనల్లో, విద్యారంగంలో, మీడియాలో వచ్చిన మార్పులు చాలా ఉన్నాయి. అయితే, ఈ మార్పులు ఏ దిశగా వెళుతున్నాయన్నదే భాషా ప్రేమికుల ఆందోళన. తప్పులు ఎంచుకుంటూ బాధపడటం కంటే, ప్రవాహశీలమైన భాషను క్రమబద్ధం చేసి దిశానిర్దేశం చేయాలన్న ఆలోచన కూడా కొంతమంది మాటల్లో బైటపడుతోంది. ఇది వ్యక్తులతో వీలయ్యే పనికాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు ఆకాడెమీలు, తెలుగు విశ్వవిద్యాలయాలు, అధికార భాషా సంఘాలు, మీడియా అకాడెమీలు ఉన్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ సంస్థల సారథ్యంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలుగు భాష వాడకం తీరుతెన్నులను సమీక్షించి ఇప్పటి 'తెలుగు తక్కువ' తరానికి మార్గదర్శనం చేసేలా సూచనలివ్వాలి.

కృత్రిమ మేధస్సు , యంత్ర అనువాదం, వాయిస్ అసిస్టెంట్లు, పాడ్‌కాస్ట్‌లు, ఓటీటీ వేదికలు, సోషల్ మీడియా, డిజిటల్ వార్తా వ్యవస్థల విస్తరణతో తెలుగు భాష వాడకం ఇంతకుముందెన్నడూ లేనంతగా పెరిగింది. అందువల్ల భవిష్యత్తులో చాలా మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. తెలుగు వాయిస్ సెర్చ్ వినియోగం పెరుగుతుంది. ఎఐ ఆధారిత వార్తా రచన అభివృద్ధి చెందుతుంది. డిజిటల్ నిఘంటువులు మరింతగా అందుబాటులోకి వస్తాయి. యూనికోడ్ వినియోగం వల్ల తెలుగు లిపి మరింత విస్తరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు కంటెంట్ వాడకం పెరుగుతుంది. మీడియాలో తెలుగు సాంకేతిక పదసంపద అభివృద్ధి చెందుతుంది. వాడుక భాషను వేగంగా జనంలోకి తీసుకువెళ్లటంలో సోషల్ మీడియా పాత్ర చెప్పకోదగినంతగా ఉంది. అయితే, భాషా ప్రమాణాల మీద ప్రతికూల ప్రభావం కూడా చూపుతోంది. అందుకే అవసరమైనంత మేరకే ఇంగ్లీష్, సంస్కృతం వాడేట్టు చూడటం ద్వారా తెలుగును కాపాడుకోవాలి. ఆధునిక తెలుగు వాడకం కోసం ఒక శైలీపత్రం తయారు చేయాలి.

# ఆలోచనలను తీర్చిదిద్దే భవిష్యత్తు నిర్మాత

**తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.తన జన్మదినోత్సవాన్ని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాక్షించిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తాను పోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఒక సందర్భంలో మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగా గుర్తుంచుకోవాలా? అనే ప్రశ్న ఎదురయింది. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలని డాక్టర్ కలాం సమాధానమిచ్చారు.**





ద్రౌపదీ ముర్ము
(రచయిత భారత రాష్ట్రపతి)

సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యాయులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. తమ సంతానం మాదిరిగానే విద్యార్థులను కూడా ఉపాధ్యాయులు ప్రేమించాలని మన ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. వారిని సమానంగా, న్యాయభావంతో చూడాలని, విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని తెలియజేస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమానికే ప్రాధాన్యమిచ్చి వారి సామర్థ్యానికి అనుగుణంగా బోధించాలని నిర్దేశిస్తున్నాయి. అలాంటి గురువులను గౌరవిస్తూ... 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి అందిస్తోంది.

ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్ని సందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకొనేవారు. ఏడో తరగతి తర్వాత పై చదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే వారి కథ... ప్రేమ, అంకితభావం ఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలో అపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు అనే గొప్ప సత్యాన్ని తెలియజేస్తుంది. ఆ ప్రోత్సాహం అందించే తోడ్పాటుతోనే జీవితంలో ఎదురయ్యే అత్యంత కఠినమైన సవాళ్లను ఎదుర్కొనే, అత్యున్నత లక్ష్యాలను సాధించే విశ్వాసాన్ని విద్యార్థులు వృద్ధి చేసుకోగలుగుతారు. ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకుండా తమ ప్రవర్తన, ఆదర్శాల ద్వారా ఫలప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన కళను, నైపుణ్యాలను సైతం విద్యార్థులకు నేర్పిస్తారు. విద్యా ప్రయాణంలో విద్యార్థికి మార్గదర్శిగా, శ్రేయోభిలాషిగా, స్నేహితునిగా, సహ ప్రయాణికునిగా ఉపాధ్యాయులు ఉంటారు.

మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం... ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీ సంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది. శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో, అపారమైన జ్ఞానాన్ని ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు అని రాశారు.

ఓ ప్రసిద్ధ సంస్కృత సూక్తి మనకు ఇలా చెబుతుంది. ''సర్వత్ర విజయం ఇచ్ఛేత్, శిష్యత్ ఇచ్ఛేత్ పరాజయం'' - ఎక్కడైనా విజయాన్ని కోరుకోవచ్చు. కానీ శిష్యుని ముందు ఓటమిని కోరుకోవాలి అని దానర్థం. విద్యార్థుల్లో స్వతంత్ర్య ఆలోచనను ప్రోత్సహించడం, వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదును పెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయపడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే అంశాల్లో కొన్ని. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన విద్య ద్వారా మాత్రమే విజయవంతమైన వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, సృజనాత్మకత ఉన్న కళాకారులు, ఆధునిక సవాళ్లకు వినూత్న పరిష్కారాలు అందించే పౌరులను సిద్ధం చేయగలం.

బోధన అంటే వృత్తి మాత్రమే కాదు. అది ఓ ప్రతిజ్ఞ. అది ఉద్యోగం లేదా పని కంటే ఎక్కువ. అది మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం. భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్ని అందించే ఉన్నతమైన బాధ్యత.

బోధనకు సంబంధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడంలో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం మా సన్నాహాలను, ఆ సమయంలో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తు చేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అందమైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలోను, జంతువులు, పక్షులు, చెట్లు, మొక్కల ప్రపంచాన్ని ఆటలు, అన్వేషణ ద్వారా వారికి పరిచయం చేయడంలోనూ గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను.

పాఠశాల విద్య పూర్తయి ఏళ్లు గడిచినా... ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలా మంది పేర్లు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారుపేర్లు కూడా గుర్తున్నాయి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నాను. బాలల నుంచి తక్షణమే స్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. రాష్ట్రపతిగా రెండో సంవత్సరాన్ని నేను పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విషయాలు నాకు గుర్తుండిపోతాయి.

సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలో ఒక గురుకుల పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకొనేందుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆ బాలలతో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సైతం నాతో పాటు పాఠశాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలం స్ఫూర్తినిచ్చేదిగా నిలిచిపోతుంది. వారి అభివృద్ధిని చూడటం నాలో ఒక ప్రత్యేకమైన అర్థవంతమైన భావనను నింపుతుంది.

విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకు మాత్రమే పరిమితం కాదు. తమ ప్రవర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉంటారు. తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై అత్యంత విశ్వాసాన్ని తల్లిదండ్రులు, సంరక్షులు ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారని వారు నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపాధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడవడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు. విద్యార్థులను తమ లాంటి ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ ఉపాధ్యాయలు దోహదపడతారు.

తమ విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయులదే. తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ... సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు.

సామాజిక సమ్మిళిత్వమే కేంద్రంగా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది. ఈ నేపథ్యంలో మన సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాల గొప్పతనాన్ని గౌరవించే, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని మానవాళి సంక్షేమానికి కృషి చేసే, అంత్యోదయ ఆదర్శాన్ని నిలబెట్టే, పర్యావరణాన్ని, సకల జీవరాశులను పరిరక్షించే, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేసే, 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని నేను కోరుకుంటున్నాను. అలాగే ప్రతి పౌరునికీ నేను ఓ విజ్ఞప్తి చేస్తున్నాను. అంకితభావం, నిబద్ధత ఉన్న ఉపాధ్యాయులను సమున్నతంగా గౌరవిద్దాం. చిత్తశుద్ధి కలిగిన ఉపాధ్యాయుల కృషితో నేర్చుకోవడాన్ని నిరంతరం కొనసాగిస్తూ... భారత్ అగ్రగామిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# ప్రజారోగ్యాన్ని పట్టించుకునేదెవరు?

**మన దేశంలో దేనికి కొరత ఉన్నా నాయకులకు మాత్రం కొరతేమీ లేదు. నింగిలో చుక్కల మాదిరిగా తెల్లచొక్కాల వాళ్లు అంతమంది ఉన్నారు కదా, జనానికి ఏమైనా ఉపయోగపడతారనుకుంటే పొరపాటే! ఆత్మస్తుతి, పరనిందలకు తప్ప ప్రజలకు పనికొచ్చేది ఏదైనా చేయడానికి వాళ్లకు తీరికే ఉండదు. నేతలు సరే వాతలు పెడుతున్నారు, అధికారులైనా ఆదుకుంటారనుకుంటే అది అంతకంటే అమాయకత్వమవుతుంది. సర్కారీ యంత్రాంగంలో చాలామందికి నాయకులూ బడాబాబుల సేవకే సమయం సరిపోవట్లేదు. ఇక వాళ్లు సామాన్యులను పట్టించుకోవాలంటే ఇటు పొద్దు అటు పొడవాలి. జీర్ణశక్తి ఎక్కువ, జ్ఞాపకశక్తి తక్కువ ఉండే నేతలూ సర్కారీ సిబ్బందికి అసలు మామూలు జనం బాధలేవీ గుర్తుండవు. ఆఖరికి న్యాయపాలిక నిర్దేశాలు కూడా వాళ్ల మహాద్భుత మెదళ్లకు ఎక్కవు. సరైన అర్హతల్లేని అనధికార వైద్యులు ప్రజలను దోపిడీ చేయడానికి అనుమతించరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించి పదహారేళ్లు గడచిపోయింది. 'స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలు దాటిపోయింది. అర్హతలు లేనివారు వైద్యులు కావడం మాత్రం ఆగట్లేదు. కోట్లాది మంది బతుకులతో వారు చెలగాటమాడుతూ యావత్ సమాజానికీ పెనుముప్పగా తయారవుతున్నారు' అంటూ మరోకేసులో సుప్రీంకోర్టు హెచ్చరించి ఎనిమిదేళ్లవుతోంది. అయినా ఎవరికి పట్టింది? తాము పుట్టిందే ప్రజాసేవకోసమంటూ బహిరంగ వేదికలపై గొంతు చించుకునే నాయకుల్లో ఎవరికైనా చీమైనా కుట్టినట్టుందా? ప్రజలకు మేలుచేసేస్తామంటూ ఉద్యోగాల్లోకి వచ్చి, ప్రజాధనంతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వాధికారుల్లోనైనా ఏమైనా చలనం వచ్చిందా? వచ్చి ఉంటే, అడపాదడపా దాడులతో సరిపెట్టకుండా వైద్యుల ముసుగులోని కేటుగాళ్లందరినీ కటకటాల్లోకి ఎందుకు నెట్టడం లేదు?**



బోనాల పండుగకు హాస్టల్ నుంచి ఇంటికొచ్చింది. సంతోషంగా సంబురాలు చేసుకుంది. ఇంతలో కాస్త జలుబు, దగ్గు రావడంతో ఊళ్లోని ఆర్ఎంపీ దగ్గరికి తీసుకెళ్లారు అమ్మానాన్నలు. అక్కడ అతను సూదిమందు ఇవ్వగానే నురగ కక్కుకుని స్పృహ తప్పిపోయింది. ఆ తర్వాత చనిపోయింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన దారుణమిది! శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పది రోజుల కిందట ఓ యువకుడు గ్యాస్ట్రబుల్‌తో ఇబ్బంది పడుతూ స్థానిక ఆర్ఎంపీని కలిశాడు. ఆ ప్రబుద్ధుడు సెలైన్ పెట్టి డోసు ఎక్కువ ఇంజెక్షన్ చేశాడు. అంతే, కడుపునొప్పితో అల్లాడిపోయి ఆ కుర్రాడు చనిపోయాడు. వారం క్రితం హైదరాబాద్‌లో జ్వరమని వచ్చిన ఓ మహిళకు ఇలాగే ఇంజెక్షన్ చేసి ఆమె ప్రాణాలుతీశాడు మరో ఆర్ఎంపీ. ఇలాంటి ఘోరాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగానూ తరచూ వెలుగుచూస్తున్నాయి. అయినా పల్లెల్లో, పట్టణాల్లోని పేదల బస్తీల్లో అర్హతల్లేని వారు నిర్వహిస్తున్న క్లినిక్‌లు అలాగే నిక్షేపంగా వర్ధిల్లుతున్నాయి. 'ఆరోగ్యంపై భారతదేశం తగినంత శ్రద్ధపెట్టలేదు. గ్రామీణ ప్రాంతాల్లో తగినంత మంది వైద్యుల్లేరు. దాంతో వైద్యులుగా చెప్పుకొనేవారిపై జనం ఆధారపడాల్సి వస్తోంది. వాస్తవానికి వీళ్లకు ఎలాంటి అర్హతలూ ఉండవు. కానీ, గ్రామీణ భారతంలో ఏదైనా చికిత్సకోసం మొదటిసారి వైద్యుణ్ని సందర్శించేవారిలో 80శాతం మంది వీళ్ల దగ్గరికే వెళ్తారు' అని ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ గతంలో ఆవేదన వ్యక్తంజేశారు. నకిలీ వైద్యులు చెదపురుగుల మాదిరిగా వ్యాపించడానికి మూలకారణమేంటో అంత స్పష్టంగా తెలుస్తున్నప్పుడు ప్రభుత్వాలెందుకు గుడ్లప్పగించి చూస్తున్నాయి? కలలో కూడా ప్రజాసంక్షేమాన్ని మర్చిపోమంటూ మైకులు బద్దలుకొట్టే నాయకులు పల్లెల్లో వైద్యవసతులను ఎందుకు బాగుపరచరు? నగరాల్లోని మురికివాడల్లో జీవనపోరాటాలు చేసే బీదాబిక్కీ జనానికి అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందేలా చేస్తే నేతల సొంత సొమ్ము ఏమైనా తరిగిపోతుందా? నన్ను ఎరిగినవాడు లేకపోతే నా బడాయి చూడమన్నాడట వెనకటికొకడు. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేసిన ఓ మాయగాడు అలాగే చర్మవ్యాధుల నిపుణుణ్ని అని చెప్పుకొంటూ హైదరాబాద్‌లో ఆసుపత్రిని నడిపిస్తూ మూడు రోజుల క్రితం పట్టుబడ్డాడు. అతితెలివితేటల్లో ఆరితేరిపోయిన అతగాడు సోరియాసిస్ చికిత్సకంటూ సొంతంగా జెల్ ఒకటి తయారుచేసి రోగులకు అంటగడుతున్నాడట. ఇలా అర్హతలేమీ లేకుండానే ఎప్పటినుంచో హాస్పిటళ్లను నిర్వహిస్తున్న మొత్తం పన్నెండు మంది నకిలీ వైద్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వైద్యంలో ఓనమాలు తెలియకపోయినా తెల్లకోటు వేసుకుంటున్న మాయగాళ్లు రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్‌లు ఇచ్చేస్తున్నారు. దానివల్ల భవిష్యత్తులో ఆ మందులేవీ పనిచేయని 'ఏఎంఆర్' సమస్య పెరిగిపోతోంది. డబ్బులు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా స్టెరాయిడ్లను కూడా రాసేస్తున్న దొంగ డాక్టర్ల కారణంగా ప్రజారోగ్యం ఇంకా దెబ్బతినిపోతోంది. కాసుల కక్కుర్తితో కాలంచెల్లిపోయిన మందులు, ఇంజెక్షన్లను రోగులకు అంటగట్టే నేరగాళ్లు కూడా వైద్యులుగా చలామణీ అవుతున్నారంటే మన వ్యవస్థ ప్రయోజకత్వాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? 'నకిలీ వైద్యానికి నయవంచన జతకలిస్తే భయంకర పరిణామాలకు దారితీయవచ్చు. వైద్యం పేరిట జరుగుతున్న దోపిడీపర్వాలకు అడ్డుకట్ట వేయాలి' అని ప్రసిద్ధ ఆర్థికనిపుణులు అమర్త్యసేన్ ప్రభుత్వాలకు పిలుపిచ్చి దశాబ్ద కాలమవుతోంది. కానీ, ఆలకించిన మహానుభావులు ఎవరున్నారు? ఉత్తర్ ప్రదేశ్‌లో ఇటీవల ఓ దొంగ డాక్టర్ మూత్రపిండాల్లో రాళ్లు తీస్తానంటూ ఓ మహిళకు శస్త్రచికిత్స చేశాడు. పీకల్దాకా మందుకొట్టి యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్ మొదలుపెట్టిన ఆ దుర్మార్గుడు పొట్టలోని నరాలను, చిన్నపేగును, అన్నవాహికను ఎడాపెడా కోసిపారేసి ఆమె ప్రాణాలు తీశాడు. ఇలా దేశవ్యాప్తంగా ఎంతోమంది మోసగాళ్లు మెడలో స్టెతస్కోపు తగిలించుకుని శస్త్రచికిత్సల పేరిట ఎందరో రోగులను బలిగొంటున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వైద్యం దొరక్క, ప్రైవేట్ హాస్పటళ్లలో ఖర్చులను భరించలేక సతమతమయ్యే పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారు కాస్త తక్కువకు చికిత్స చేస్తామనే ఇలాంటి నకిలీ డాక్టర్ల మాయలో పడుతున్నారు. చివరికి అయినవారిని అర్ధాంతరంగా పోగొట్టుకుని అంతులేని దుఃఖ□ంలో మునిగిపోతున్నారు. ప్రజారోగ్య రంగంలో సదుపాయాలను మెరుగుపరుస్తామంటూ ప్రభుత్వాలు దశాబ్దాలుగా ఊదరగొడుతున్నాయి కానీ, వాటి మాటలను నమ్మడమంటే మట్టెద్దుతో అరక దున్నించాలనుకోవడమే అవుతుంది. నకిలీ వైద్యులను పట్టుకుని కేసులు పెడుతున్నామని అధికార గణాలు సెలవిస్తుంటాయి కానీ, ఎంతమందికి ఎన్నేళ్లు శిక్షలు పడుతున్నాయంటే మాత్రం అవి నీళ్లు నములుతాయి. ప్రజలకోసమే తాము ఉన్నామన్న కనీసపాటి ఆలోచన నాయకుల్లోనూ యంత్రాంగంలోనూ రానంతకాలం జనభారతానికి పట్టిన ఈ ప్రారబ్ధం తప్పిపోదు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# శ్రీ చౌడేశ్వరీ దేవి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఆమడగూరు సెప్టెంబర్ 4( అనంత జనశక్తి న్యూస్)**

అమడగూరు, శ్రీ చౌడేశ్వరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు అంబరాన్ని అంటాయి. పల్లెల్లో ఎటు చూసినా పండుగ శోభ ఉట్టి పడింది. కనుచూపు మేరలో పచ్చదనం పరుచుకున్న గ్రామాల్లో చిన్నారుల సందడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించింది.సంస్కృతి, సంప్రదాయాలకు పల్లెల్లో కృష్ణాష్టమి వేడుకలు నిండైన తెలుగుతనాన్ని ప్రతిబింబించేలా అత్యంత వైభవంగా సాగాయి. మండల కేంద్రంలోని స్థానిక శ్రీ చౌడేశ్వరీ దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో కారాస్పాండెంట్ జంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థి విద్యర్తునులు అందమైన శ్రీకృష్ణుని వేషధారణలతో గోపికల లంగా ఓణీలు ధరించి కృష్ణుడిని ఆరాధించే గోపికలుగా ముస్తాబయ్యారు. పసిపిల్లలు, విద్యార్థులు చిన్నికృష్ణుడి అలంకరణలో అదరహో అనిపించారు.నుదుటన అందమైన తిలకం, తలపై



నెమలి పింఛం, చేతిలో పిల్లనగ్రోవి పట్టుకుని కృష్ణుడి ప్రతిరూపాలుగా కనువిందు చేశారు. వారి ఆహార్యం చూస్తుంటే ఆ మడుగురు మండలంలో పల్లెలు ప్రాంగణమంతా సాక్షాత్తూ బృందావనాన్ని కళ్ల ముందు నిలిపింది.ముద్దులొలికే బాలకృష్ణులు, చిరునవ్వులు చిందించే గోపికల కోలాహలంతో వీధులన్నీ పండుగ కళను సంతరించుకున్నాయి.కృష్ణాష్టమి అంటేనే ఆట పాటలు, ఉట్టి కొట్టే ఘట్టాలు. ఇవి పండుగకు ఎనలేని ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. గోపికల వేషధారణలో వచ్చిన యువతులు మురళీధరుని భక్తి గీతాలకు లయబద్ధంగా అడుగులు వేస్తూ నాట్యం చేశారు. బాలకృష్ణులు సైతం వారికి జతకలిసి చిందులు వేయడం చూసే ప్రేక్షకులను ఆనందసాగరంలో ముంచెత్తింది. స్వామివారి జననం, బాల్య క్రీడలు తదితర ఘట్టాలను వివరిస్తూ సాగిన నృత్య ప్రదర్శనలు భక్తి భావాన్ని రగిలించాయి. యువతులు గోపికలుగా మారి కృష్ణుడి సేవలో తన్మయత్వం చెందుతూ చేసిన అభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరి మన్ననలు పొందింది. పండుగల సాక్షిగా భావితరాలకు మన అద్భుతమైన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రత్యక్షంగా పరిచయం చేస్తున్నారు. కేవలం సంక్రాంతి సమయాల్లో మాత్రమే గ్రామాల్లో ఎక్కువగా కనిపించే పల్లెటూరి అలంకరణలు, తెలుగు కట్టుబొట్టు ఇప్పుడు కృష్ణాష్టమి వేడుకల్లోనూ దర్జాగా దర్శనమివ్వడం గొప్ప విశేషం. పిల్లల్లో దాగి ఉన్న భక్తిని, సంప్రదాయాలపై ఆసక్తిని పెంపొందిస్తూ ఈ వేడుకలు స్థానికులకు మధుర జ్ఞాపకాలను మిగిల్చాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు వందలాది సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని



**– కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 4,అనంత జనశక్తి న్యూస్**

: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సోదరుల ఆహ్వానం మేరకు శుక్రవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శ్రీకృష్ణ పరమాత్ముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సోదరులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

# అల్లూరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా బిబి విజయ

**– విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో సేవలు**

**అనంతగిరి సెప్టెంబర్ 04 అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారానికి కాశీపట్నం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని బిబి విజయ ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సమగ్ర అభివృద్ధి కోసం బిబి విజయ ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రేమ, బాధ్యత, ఓర్పుతో బోధిస్తూ ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి వెలికితీసేందుకు ఆమె చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఒక ఉపాధ్యాయురాలి కృషికి లభించే గొప్ప గుర్తింపు విద్యార్థుల విజయమేనని, ఆ విజయాలకు మార్గదర్శకురాలిగా బిబి విజయ నిలుస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారానికి ఎంపిక కావడం ఆమె సేవలకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు.ఈ పురస్కారం ఆమెకు మరింత ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందించి భవిష్యత్తులో విద్యారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులు ఈ సందర్భంగా బిబి విజయకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



# బొంతలపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 04 అనంత జన శక్తి న్యూస్.**

శ్రీకృష్ణ జన్మాష్టమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను ఆచరించాలని బోధించే పవిత్రమైన రోజు అని ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం బొంతలపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యాదవ సమాజానికి శ్రీకృష్ణ పరమాత్మ ఆరాధ్య దైవమని, ఆయన ఆదర్శాలు, బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత కృష్ణుడి క్రమశిక్షణ, ధైర్యం, నాయకత్వ లక్షణాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. బొంతలపల్లి గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించడం అభినందనీయమని, శ్రీకృష్ణుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యాదవ సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడమే నిజమైన పండుగ

**- మంత్రి కందుల దుర్గేష్**

**- కాల్దారి, వెలివెన్ను గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు సెప్టెంబర్ 04 అనంత జనశక్తి న్యూస్**

సమాజంలో మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేలా వేడుకలను నిర్వహించుకోవడమే నిజమైన పండుగ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని కాల్దారి, వెలివెన్ను గ్రామాల్లో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వేడుకల సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కోలాటం, కూచిపూడి తదితర సాంస్కృతిక నృత్యరూపకాలు, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ప్రదర్శనలు భక్తులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శాంతి సౌభాగ్యాలకు ప్రతీకగా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా కపోతాన్ని (పావురాన్ని) పట్టుకుని, శుభాకాంక్షలు తెలియజేశారు.



**మానవాళి జీవిత గమనానికి గీతోపదేశమే మార్గదర్శి**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "కృష్ణం వందే జగద్గురుమ్" అని స్మరించుకుంటూ, విశ్వగురువైన శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా మానవాళికి అమూల్యమైన జ్ఞానాన్ని ప్రసాదించారని చెప్పారు. మనిషి తన జీవితాన్ని ఏ విధంగా గడపాలి, కష్టనష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎలా నిలబడాలి అనేది భగవద్గీత గ్రంథం ద్వారా స్పష్టంగా మార్గదర్శనం చేశారన్నారు. కాల్దారి గ్రామంలో జరిగే జన్మాష్టమి వేడుకలకు హాజరుకావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తుందని, వరుసగా ఇది 3వ సారి తాను ఇక్కడి వేడుకల్లో పాల్గొనడం అని మంత్రి గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో కూడా ప్రతి ఏటా ఈ పవిత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆ శ్రీకృష్ణుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ఈ వేడుకలను పండగలా నిర్వహించిన నిర్వాహకులు ఫణికుమార్, రామ్‌దాస్, సుబ్బారావు, సత్యనారాయణలను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాచీన నృత్యరీతులను ప్రోత్సహించడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పటికీ సజీవంగా నిలుస్తాయని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు.

# సంచార జాతుల విద్యాభివృద్ధికి కృషి అధ్యాపకులకు సన్మానం



**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 04 అనంత జన శక్తి న్యూస్.**

సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న వారి సేవలను గుర్తించి సన్మానించారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులకు సామాజిక కార్యకర్తలకు రక్తదాతలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వారి సేవలను గుర్తించి స్థానిక ఎంపీ చేతులు మీదుగా వారిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. శ్రీ సత్యసాయి అక్షర జ్యోతి శిక్షణ కేంద్రం ద్వారా సంచార జాతుల విద్యాభివృద్ధికి, ఒంటరి మహిళల జీవితాల్లో వెలుగులు నింపడానికి, పేద విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులు, మానసిక వికలాంగుల జీవనోపాధికి కృషి చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీ దేవాంగం జగదీశ్వర్ ని ఘనంగా సన్మానించారు. ఈయన పుట్టపర్తి మండల పరిధిలోని ప్రశాంతి గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈయన సేవలను గుర్తించిన సంస్థ, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రం, అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హార్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ , సత్యసాయి కాలేజీ ప్రిన్సిపాల్ మధుమాల అనంతపూర్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, అకాడమీ నిర్వాహకులు భరత్, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి: మంత్రి కందుల దుర్గేష్

**- రాజమహేంద్రవరం కార్మిక అసిస్టెంట్ కమిషనర్(ఎఫ్ఏసీ) కాశీ శివనాగ మల్లేశ్వరరావుకు మంత్రి కందుల దుర్గేష్ సూచన**

**- మంత్రి కందుల దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజమహేంద్రవరం లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లేశ్వరరావు**

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 04,అనంత జనశక్తి న్యూస్**

కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ను రాజమహేంద్రవరం కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ) కాశీ శివనాగ మల్లేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మల్లేశ్వరరావుకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ పరిధిలోని వివిధ విధులను, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను నిశితంగా పరిశీలించి పకడ్బందీగా



అమలు చేయాలని మంత్రి సూచించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ శాఖాపరమైన సేవలను మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా కడియం పేపర్ మిల్లు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. మిల్లు కార్మికుల సమస్యలను తక్షణమే అధ్యయనం చేసి, వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్మికులకు న్యాయం జరిగేలా శాఖాపరంగా చొరవ చూపాలని స్పష్టం చేశారు.మంత్రి దుర్గేష్ సూచనలను తప్పనిసరిగా పాటిస్తానని ఈ సందర్భంగా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ) కాశీ శివనాగ మల్లేశ్వరరావు తెలిపారు.

# సన్న బియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రఘునాథపాలెం మండలం పుటాని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏపీవో రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల మాటిచ్చారు. కేవలం. వ్యవసాయం మీదనే బతికే కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ ఏడాది వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని... వేసిన పంటలు పండే అవకాశం లేదని తెలిపారు. తీవ్రమైన కరువు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు. నీళ్లు లేకపోయినా బతికే పంట ఫామ్ ఆయిల్ అని చెప్పారు. పామాయిల్ పంట వేస్తే అన్నీ ఉచితంగా ఇస్తామని స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలానికి ఈ రాత్రికి నీళ్లు వదులుతున్నామని, రేపు మోటార్లు ఆన్ చేసుకోవాలని అన్నారు. ఆర్‌వీఎఫ్ఆర్ పట్టా ఉన్న వారికి బోర్ అనుమతి ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రూ.75 కోట్లతో 200 డొంక రోడ్లన్నీ వేయిస్తానని, దీంతో పాటు పొలాలకు వెళ్లేందుకు ఉన్న రోడ్లు కూడా వేయిస్తానని మంత్రి తుమ్మల తెలిపారు. పిల్లల చదువు కోసం స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల కూడా రాబోతుందని వెల్లడించారు. పిల్లలకు చదువు లేకపోతే బతుకులు మారవని వివరించారు. వందల కోట్లు పెట్టి పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తుంటే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# రికార్డు సృష్టించిన మెలోని

(మొదటి పేజీ తరువాయి)

గతంలో ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ ప్రభుత్వం నెలకొల్పిన రికార్డును మెలోనీ ప్రభుత్వం తాజాగా అధిగమించింది. 2022 అక్టోబర్ 22వ తేదీన ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన జార్జియా మెలోనీ.. రాజకీయ సంక్షోభాలు లేకుండా తన ప్రభుత్వాన్ని ఇప్పటికీ విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా మెలోనీకి అభినందనలు తెలిపారు. ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన విశ్వాసానికి ఈ రికార్డు ప్రతిబింబమని వెల్లడించారు. రానున్న రోజుల్లో కూడా జార్జియా మెలోనీ మరిన్ని విజయాలు సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అలాగే భారత్, ఇటలీ ప్రజల సుసంపన్న భవిష్యత్తు కోసం ఇరు దేశాల మధ్య సన్నిహిత సహకారాన్ని కొనసాగించేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, జార్జియా మెలోనీ మధ్య స్నేహపూర్వక సంబంధాలు అంతర్జాతీయ వేదికలపై తరచూ చర్చకు వస్తుంటాయి. వీరి పేర్లను కలిపి సోషల్ మీడియాలో మెలోడీ అనే పదం కూడా వైరల్‌గా మారింది. ఇటీవల మెలోడీ సెల్ఫీ వీడియో నెట్టింట తెగ వైరల్ అయింది. ఈ క్రమంలోనే మోదీకి మెలోనీ.. మెలోడీ చాక్లెట్ ఇచ్చిన వీడియో కూడా నెట్టింట చక్కర్లు కొట్టింది.

**ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ, మెలోనీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ఉన్నతస్థాయి పర్యటనలు, వార్షిక నేతల సమావేశాలు, మంత్రులు, వివిధ సంస్థల మధ్య క్రమం తప్పకుండా చర్చలు కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇటీవల జార్జియా మెలోనీ కూడా ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. భారత చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సాధించిన సందర్భంగా ఆమె శుభాకాంక్షలు చెప్పారు. భారత్, ఇటలీ మధ్య కొత్త అవకాశాలను సృష్టించేలా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.**



# సింగరేణి మాజీ ఉద్యోగులకు సూచన

**- ఆరోగ్య కార్డులు వెంటనే రెన్యువల్ చేసుకోండి**

**- నవంబర్‌లో జీవిత ధ్రువీకరణ పత్రం**

**మణుగూరు, సెప్టెంబర్ 4, అనంత జనశక్తి**

సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన మాజీ ఉద్యోగులు వైద్య సేవలు నిరాటంకంగా పొందేందుకు ప్రతి సంవత్సరం జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించి ఆరోగ్య కార్డులను రెన్యువల్ చేసుకోవాలని మణుగూరు ఏరియా ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్ సూచించారు. మణుగూరు ఏరియాలో మొత్తం 4,448 ఆరోగ్య కార్డులు జారీ కాగా, 4,221 కార్డులు రెన్యువల్ అయ్యాయని, ఇంకా 227 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2027 సంవత్సరానికి ఆరోగ్య కార్డు రెన్యువల్ కోసం నవంబర్‌లో జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జీవన్ ప్రమాణ్, ఆధార్ ఫేస్ ఆర్‌డీ వంటి మొబైల్ యాప్‌ల ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో సమర్పించుకోవచ్చని, లేదా సమీప మీసేవా కేంద్రం ద్వారా కూడా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 227 మంది మాజీ ఉద్యోగులు ఎలాంటి ఆలస్యం చేయకుండా కార్డులను రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

# గురువులకు ఎంపీ శుభాకాంక్షలు



**- ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది**

**- రాధాకృష్ణన్ ఆశయాలను కొనసాగించాలి**

**భద్రాద్రికొత్తగూడెం బ్యూరో , సెప్టెంబర్ 4, అనంత జనశక్తి**

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని నేర్పించే మార్గదర్శకులు ఉపాధ్యాయులని ఎంపీ కొనియాడారు. భారతీయ సంస్కృతిలో గురువులకు విశిష్ట స్థానం ఉందన్నారు. రాధాకృష్ణన్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. గురువులందరికీ మరోసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక కార్యక్రమాలు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 4, అనంత జనశక్తి**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2026 ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే, కొత్తగా పేరు నమోదు చేయడం, పేరు తొలగించడం లేదా వివరాల్లో మార్పులు చేయాల్సి ఉంటే నిర్ణీత ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా సంబంధిత బీఎల్ఓ లేదా ఈఆర్ఓలకు దరఖాస్తులు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. ప్రత్యేక ప్రచార తేదీల్లో బీఎల్ఓలు తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 4, అనంత జనశక్తి**

అశ్వారావుపేట లో కృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు కృష్ణుడు గోపికలవేషధారణలో సందడి చేశారు . ముందుగా చిన్నారులు శ్రీ కృష్ణుడిని పూజించి, వెన్న, మీగడలను నైవేద్యంగా సమర్పించారు. ఉట్టి సంబరాలలో పాల్గొన్నారు. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు అన్నీ పండుగలే. ముఖ్యంగా మహిళలు అత్యంత ఇష్టంగా భావించే మాసం శ్రావణ మాసం. ఈ మాసంలోనే శ్రీ కృష్ణుని జన్మదినం శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరగటం కూడా విశేషం. తన లీలలతో భక్తి, జ్ఞానం, యోగం, మోక్షం గురించి మానవాళికి సందేశం ఇచ్చారు నల్లనయ్య. శ్రీకృష్ణపరమాత్మ పుట్టిన శుభదినమే శ్రీ కృష్ణాష్టమి. దీనినే కృష్ణ జన్మాష్టమి అని కూడా అంటారు. అంతేకాదు గోకులాష్టమి, శ్రీకృష్ణ జయంతిగా కూడా పిలుస్తారు.





# గిరిజన రైతు బిడ్డ.. వైద్యుడి బాటలో!

**- మారుమూల నడిమిగూడెం నుంచి నీట్‌లో సత్తా.. 434 మార్కులతో 19,680వ ర్యాంకు**

**- మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన పాయం చాణక్య**

**గుండాల, సెప్టెంబర్ 4, అనంత జనశక్తి న్యూస్:**



పేదరికం.. మారుమూల ప్రాంతం.. పరిమిత వసతులు.. ఇవేవీ అతడి లక్ష్యానికి అడ్డంకులు కాలేదు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే గిరిజన రైతు కుటుంబం నుంచి వచ్చిన పాయం చాణక్య పట్టుదలతో చదివి వైద్య విద్యలో అడుగుపెట్టాడు. నీట్ -2026లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించి తన కుటుంబానికే కాదు.. నడిమిగూడెం గ్రామంతో పాటు ఆళ్లపల్లి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం నడిమిగూడెం గ్రామానికి చెందిన చాణక్య తల్లిదండ్రులు వ్యవసాయమే జీవనాధారంగా సాగిస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో చదువుకు ఎదురయ్యే భౌగోళిక, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమించాడు.

**నీట్‌లో ప్రతిభ.. ప్రభుత్వ కోటాలో సీటు**

2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన నీట్ పరీక్షలో 434 మార్కులు సాధించి 19,680 ర్యాంకు పొందాడు. ఎస్టీ కేటగిరీలో కౌన్సెలింగ్ ద్వారా హైదరాబాద్ బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద చాణక్యకు ఈ సీటు కేటాయించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ అతడిని అభినందించారు.

**యువతకు స్ఫూర్తిగా..**

మారుమూల గిరిజన గ్రామం నుంచి వైద్య విద్య వరకు చాణక్య సాగించిన ప్రయాణం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు, గ్రామీణ ప్రాంత పరిమితులు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని.. పట్టుదల, కష్టపడి చదివే తత్వం ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చాణక్య నిరూపించాడని అభినందించారు. తన ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు సాధించిన చాణక్య భవిష్యత్తులో వైద్యుడిగా గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

# భక్తి పారవశ్యంలో.. గుండాల ఆళ్లపల్లి !

**- శ్రీకృష్ణ నామస్మరణతో మార్మోగిన పల్లెలు..**

**- కన్నులపండువగా జన్మాష్టమి వేడుకలు**

**- ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**

**- వైభవంగా స్వామివారి ఊరేగింపులు..**

**- కోలాటాలతో మహిళల సందడి**

**- ఉట్టి కొట్టే వేడుకలకు పోటెత్తిన భక్తులు..**

**- రాధ, సత్యభామ, బాలకృష్ణుల వేషధారణల్లో చిన్నారుల కనువిందు**



**గుండాల ఆళ్లపల్లి,**

**సెప్టెంబర్ 4, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం గుండాల ఆళ్లపల్లి మండలాలన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. మండలంలోని పల్లెలన్నీ పండుగ శోభతో కళకళలాడగా.. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే మంగళవాయిద్యాలు, భజనలు, కీర్తనలు, శ్రీకృష్ణ నామస్మరణలతో పల్లెలు మార్మోగాయి. చిన్నారులు బాలకృష్ణుల వేషధారణల్లో అలరించగా.. మహిళలు సంప్రదాయ కోలాటాలతో భక్తిభావాన్ని చాటుకున్నారు. యువత ఉట్టి కొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనగా.. వృద్ధులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని గోపాలుడిని దర్శించుకున్నారు. గ్రామగ్రామాన భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలతో ఆలయాలకు చేరుకుని కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**పల్లెపల్లెలో పండుగ శోభ**

మండలలోని వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణ ప్రతిమలను సుందరంగా అలంకరించి భక్తుల నామస్మరణల మధ్య ఊరేగింపులు నిర్వహించారు. పలుచోట్ల , భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మహిళల కోలాటాలు, చిన్నారుల కృష్ణవేషధారణలు, యువత ఉట్టి కొట్టే వేడుకలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**భక్తి.. సంప్రదాయం.. ఐక్యత**

కులమతాలకు అతీతంగా ప్రజలు ఒకచోట చేరి శ్రీకృష్ణుని లీలలను స్మరించుకుంటూ జన్మాష్టమి వేడుకలను జరుపుకోవడం విశేషంగా నిలిచింది. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన వేడుకలతో గుండాల,ఆళ్లపల్లి మండలాలు మొత్తం 'గోవిందా.. గోపాలా.. జై శ్రీకృష్ణ' నామస్మరణతో మార్మోగింది.

# మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు

**- కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తాం**

**- కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక టిఆర్ఎస్ పార్టీ కుట్రలు**

**- మన్ సాన్ పల్లి చౌరస్తా నుండి మహేశ్వరంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ**

**- మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టేలా మల్లేష్ యాదవ్**

***మహేశ్వరం, సెప్టెంబర్ 04, ( అనంత జనసాక్షి )**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో మన్ సాన్ పల్లి చౌరస్తా నుండి మహేశ్వరంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వట్టేలా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 1000 రోజులు ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలలో కూడా విజయ వారోత్సవాలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు కూడా ప్రజలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు ,రాజీవ్ ఆరోగ్యశ్రీ , చేయూత పెన్షన్లు, రైతు రుణమాఫీ, సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ యువ వికాసం, మహిళా సంఘాలకు మద్దతు లాంటి పథకాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నదని అన్నారు. బిఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో రేషన్ కార్డ్స్, డబుల్ బెడ్రూం, రైతు రుణమాఫీ, దళితుడే సీఎం , ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, దళిత బంధు, రైతు బంధు, కాళేశ్వరం పథకాల పేరు చెప్పి ప్రజలను మోసం చేసి ప్రజాధనాన్ని కోట్లకు, కోట్లకు స్వాహా చేశారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే , ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ వాళ్ళు చేస్తున్న వంటవార్పు కార్యక్రమం అదొక బోగస్ కార్యక్రమం అని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోని తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, తప్పుడు ప్రచారాలు మనకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం 1000 రోజుల ప్రజాపాలన విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి జనరల్ సెక్రటరీ నందిగామ నర్సింహా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరం సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు ఉప్పుగడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్, శివగంగా దేవాలయ కమిటీ ఛైర్మన్ అల్లే కుమార్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చాకలి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు చిన్నతుప్ర సర్పంచ్ రాజు గొల్లురి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాకి ఈశ్వర్, ఏర్పుల శ్రీశైలం, పాండు నాయక్, మోహన్ నాయక్,పుట్లగారి చందు, బుడుగు రాఘవేందర్, కుమార్ యాదవ్, ఎర్ర యాదగిరి, ఏర్పుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన జైత్రయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

## బీజేపీ సీనియర్ నేత చెరుకుపల్లి వెంకటరెడ్డి

**మహేశ్వరం, సెప్టెంబర్ 04 ( అనంత జనశక్తి ):**



సెప్టెంబర్ 06న బాలాపూర్ చారిత్రాత్మక గణేష్ చౌక్ నుండి చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వరకు జరగనున్న తెలంగాణ విమోచన జైత్రయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు, బడంగ్ పేట మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి శ్రీరాములు ఆధ్వర్యంలో ఈ భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం జరగబోయే ఈ చారిత్రాత్మక ర్యాలీకి బీజేపీ, బీజేవైఎం, బజరంగ్ దళ్, ఏబీవీపీ తో పాటు బీజేపీ అనుబంధ అన్ని మోర్చాల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, అన్ని రంగాల యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.మన స్వయం ప్రతిపత్తిని, సంస్కృతిని ఘనంగా చాటుకుందామని ఆయన పిలుపునిచ్చారు.ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

# పట్టణంలో విజృంభిస్తున్న విషజ్వరాలు


**- వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రజలు**

**- దోమల బెడదతో విలవిల్లాడుతున్న జనం**

**నాగార్జునసాగర్ సెప్టెంబర్ 4 అనంత జనశక్తి న్యూస్**

నాగార్జునసాగర్ పట్టణంలో దోమల బెడద విపరీతంగా పెరగడంతో ప్రజలు డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడి విలవిల్లాడు తున్నారు,పట్టణంలోని పలు కాలనీలలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది,ప్రధాన వీధులతో పాటు కాలనీలలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి,సాయంత్రం,అయిందంటే చాలు ఇళ్లలోకి దోమలు గుంపులుగా వస్తుండటంతో ప్రజలు కనీసం ప్రశాంతంగా ఉండలేని దుస్థితి నెలకొంది,కాలనీలలో ఎక్కడా ఫాగింగ్ లేదా బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమాలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,పరిశుభ్రత లోపించి దోమల ఉధృతి పెరగడంతో పట్టణంలోని జ్వరాల బారిన పడుతున్నారు,చిన్నారులు,వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ లక్షణాలతో ప్రభుత్వ,ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైద్య సేవల కోసం ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, స్పందించి పట్టణంలో ఫాగింగ్ చేయించి ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# వయసు పెరిగేకొద్దీ ముప్పు.. మూత్ర సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు!

## ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అప్రమత్తతే ఆయుధం.. తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్సకు అవకాశం

**అనంతపురం సెప్టెంబర్ 04 అనంత జనశక్తి న్యూస్**
**ఇటీవల పెరుగుతున్న క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటిగా నిలుస్తోంది. వయసు పెరుగుతున్న పురుషుల్లో సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యల్లో మూత్ర సంబంధిత ఇబ్బందులు ముఖ్యమైనవి. అయితే తరచూ మూత్రం రావడం, రాత్రిపూట పదేపదే మూత్ర విసర్జనకు లేవడం, మూత్రం ప్రారంభించడానికి ఎక్కువ సమయం పట్టడం, మూత్రధార బలహీనంగా ఉండటం వంటి లక్షణాలను కేవలం వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేయడం సరికాదు. కొన్ని సందర్భాల్లో ఇవి ప్రోస్టేట్ క్యాన్సర్‌కు సంకేతాలు కావచ్చు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన పురుషులు ఈ లక్షణాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.**





### తొలిదశలో లక్షణాలు లేకపోవచ్చు

ప్రోస్టేట్ క్యాన్సర్‌లో ముఖ్యమైన సమస్య ఏమిటంటే.. ప్రారంభ దశలో చాలా మందికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు ఉండకపోవచ్చు. క్యాన్సర్ పెరిగినప్పుడు లేదా వ్యాప్తి చెందినప్పుడు లక్షణాలు కనిపించవచ్చు.

### ప్రోస్టేట్ నిర్దిష్ట ప్రతిజనక పరీక్షతో ముందస్తు అంచనా


ప్రోస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించడంలో ప్రోస్టేట్ నిర్దిష్ట ప్రతిజనక రక్త పరీక్ష ముఖ్యమైనది. ప్రోస్టేట్ నిర్దిష్ట ప్రతిజనకం అనేది ప్రోస్టేట్ తయారు చేసే పదార్థం. దీని స్థాయి పెరిగితే ప్రోస్టేట్ క్యాన్సర్‌తో పాటు నిరపాయ ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదల లేదా సంక్రమణ వంటి ఇతర పరిస్థితులు కూడా కారణం కావచ్చు. అందువల్ల దీని స్థాయి ఎక్కువగా ఉందని మాత్రమే క్యాన్సర్ నిర్ధారణ చేయలేం.అవసరాన్ని బట్టి వైద్యుడు మలద్వార పరీక్ష, అయస్కాంత ప్రతిధ్వని చిత్రీకరణ, కణజాల పరీక్ష వంటి పరీక్షలను సూచించవచ్చు. భారతీయ మూత్ర సంబంధిత వైద్య మార్గదర్శకాలు కూడా వయసు, కుటుంబ చరిత్ర, ఆరోగ్య పరిస్థితి, జీవించే అవకాశాల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగతంగా ముందస్తు పరీక్షలపై నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నాయి.

### జీవనశైలిలో మార్పులు ఉపయోగకరం

ప్రోస్టేట్ క్యాన్సర్‌ను పూర్తిగా నివారించే నిర్దిష్ట ఆహారం లేదా ఒకే ఒక్క జీవనశైలి మార్పు నిరూపితం కాలేదు. అయితే ఆరోగ్యకరమైన జీవనశైలి అనేక దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.బరువును ఆరోగ్యకర స్థాయిలో ఉంచుకోవాలి. రోజూ శారీరక వ్యాయామం చేయాలి. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. శుద్ధి చేసిన మాంసం, అధిక కొవ్వు ఆహారాన్ని పరిమితం చేయాలి. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. మద్యం తీసుకునే వారు పరిమితంగా తీసుకోవాలి. వైద్యుల సూచన లేకుండా హార్మోన్ లేదా ఇతర మందులు వాడకూడదు.

### ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది..

ప్రోస్టేట్ క్యాన్సర్ అంటే జీవితానికి ముగింపు కాదు. తొలిదశలో గుర్తించిన అనేక కేసులకు చికిత్స ద్వారా మంచి నియంత్రణ, దీర్ఘకాలిక ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. క్యాన్సర్ దశను బట్టి శస్త్రచికిత్స, కిరణ చికిత్స, హార్మోన్ చికిత్స, కణాలపై పనిచేసే ఔషధ చికిత్సలు, ఆధునిక లక్ష్యిత చికిత్సలు తదితర అనేక అవకాశాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.50 ఏళ్లు దాటిన పురుషులు మూత్ర సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా మూత్ర సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడిని సంప్రదించడం, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉంటే ముందుగానే వైద్య సలహా తీసుకోవడం అత్యంత ముఖ్యం.






డా. ఎం. జి. ధనుష్ యాదవ్
మూత్ర సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు
కిమ్స్ సవీర, అనంతపురం

### అసలు ప్రోస్టేట్ అంటే ఏమిటి?

ప్రోస్టేట్ పురుషులలో మూత్రాశయం కింద ఉండే చిన్న గ్రంథి. ఇది వీర్యంలోని కొంత ద్రవాన్ని తయారు చేయడంలో సహాయపడుతుంది. వయసు పెరిగే కొద్దీ ప్రోస్టేట్ పరిమాణం పెరగడం సాధారణం. దీనిని నిరపాయ ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదల అంటారు. ఇది క్యాన్సర్ కాదు. అయితే ప్రోస్టేట్‌లోని కొన్ని కణాలు అసాధారణంగా, నియంత్రణ లేకుండా పెరగడం ప్రారంభిస్తే ప్రోస్టేట్ క్యాన్సర్ ఏర్పడుతుంది. చాలా ప్రోస్టేట్ క్యాన్సర్లు గ్రంథి కణాల నుంచే ఏర్పడే గ్రంథి కణ క్యాన్సర్లుగా ఉంటాయి.

### క్యాన్సర్ ఎందుకు వస్తుంది?

ప్రోస్టేట్ క్యాన్సర్‌కు ఒకే ఒక్క కారణాన్ని నిర్ధారించడం సాధ్యం కాదు. వయసు, కుటుంబ చరిత్ర, జన్యుపరమైన అంశాలు తదితరాలు ప్రమాదాన్ని పెంచవచ్చు.

### ప్రధాన ప్రమాద కారకాలు:

వయసు: 50 ఏళ్లు దాటిన తర్వాత ముప్పు పెరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ ప్రమాదం మరింత ఎక్కువవుతుంది.కుటుంబ చరిత్ర: తండ్రి, సోదరుడు వంటి దగ్గరి బంధువుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఉంటే వ్యక్తికి ప్రమాదం పెరగవచ్చు.జన్యుపరమైన కారణాలు: కొన్ని వారసత్వ జన్యు మార్పులు, ముఖ్యంగా బీఆర్‌సీఏ2 వంటి జన్యువులు, వైద్యపరంగా ముఖ్యమైన ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచవచ్చు.అధిక బరువు, జీవనశైలి: ఊబకాయం, శారీరక చురుకుదనం తక్కువగా ఉండటం వంటి అంశాలు మొత్తం ఆరోగ్యానికి ప్రతికూలంగా ఉంటాయి. అయితే వీటిని ప్రోస్టేట్ క్యాన్సర్‌కు నేరుగా నిర్ధారిత కారణాలుగా చెప్పలేం.భారతదేశంలో ప్రోస్టేట్ క్యాన్సర్ కేసులు గత కొన్ని దశాబ్దాల్లో పెరుగుతున్నాయని భారత వైద్య పరిశోధనా మండలి నివేదికలు చెబుతున్నాయి. పట్టణ క్యాన్సర్ నమోదు కేంద్రాల్లో ఇది పురుషుల్లో ముఖ్యమైన క్యాన్సర్లలో ఒకటిగా నమోదవుతోంది.


### క్యాన్సర్ నిర్ధారణ ఎలా చేస్తారు?

**సాధారణంగా వైద్యులు రోగి లక్షణాలు, వయసు, కుటుంబ చరిత్రను పరిశీలించిన తర్వాత అవసరమైన పరీక్షలు సూచిస్తారు.**
**ప్రధాన పరీక్షలు:**
1. **ప్రోస్టేట్ నిర్దిష్ట ప్రతిజనక రక్త పరీక్ష: రక్తంలో ప్రోస్టేట్ నిర్దిష్ట ప్రతిజనక స్థాయిని తెలుసుకోవడానికి.**
2. **మలద్వార పరీక్ష: వైద్యుడు ప్రోస్టేట్ పరిమాణం, గట్టితనం లేదా అసాధారణ ప్రాంతాలను అంచనా వేయడానికి చేసే పరీక్ష.**
3. **బహుళ పారామితుల అయస్కాంత ప్రతిధ్వని చిత్రీకరణ: అనుమానాస్పద ప్రాంతాలను గుర్తించడంలో సహాయపడుతుంది.**
4. **ప్రోస్టేట్ కణజాల పరీక్ష: అనుమానాస్పద కణజాలాన్ని తీసుకుని సూక్ష్మదర్శిని ద్వారా పరీక్షించడం ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారిస్తారు.**

**క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత అది ప్రోస్టేట్‌కే పరిమితమైందా? సమీప కణజాలాలకు లేదా ఇతర అవయవాలకు వ్యాపించిందా? అన్నది తెలుసుకోవడానికి అవసరమైన చిత్రీకరణ పరీక్షలు చేస్తారు.**
**రోబోటిక్ శస్త్రచికిత్సతో చికిత్స**
**ప్రోస్టేట్‌కు పరిమితమైన కొన్ని క్యాన్సర్లలో సంపూర్ణ ప్రోస్టేట్ తొలగింపు శస్త్రచికిత్స చేయవచ్చు. ఎంపికైన రోగుల్లో రోబోటిక్ సహాయంతో చేసే ఆధునిక కనిష్ఠ కోతల శస్త్రచికిత్స పద్ధతులు కూడా ఉపయోగించబడుతున్నాయి. అయితే ప్రతి రోగికి రోబోటిక్ శస్త్రచికిత్స అవసరం ఉండదు. క్యాన్సర్ దశ, రోగి ఆరోగ్యం, శస్త్రచికిత్సకు అనుకూలత వంటి అంశాల ఆధారంగా మూత్ర సంబంధిత వ్యాధుల లేదా మూత్ర సంబంధిత క్యాన్సర్ వైద్య నిపుణులు నిర్ణయిస్తారు.**

# లెక్కలంటే భయమా లేక డిస్కాల్క్యులియానా, అంకెలు అర్థం కాకపోవడం వెనుక అసలు నిజం ఏంటో తెలుసా?

**డిస్కాల్క్యులియా అనేది ఒక నిర్దిష్ట అభ్యాస వైకల్యం . ఇది అంకెలు, పరిమాణాలు, ప్రాథమిక గణిత భావనలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. దీనివల్ల లెక్కించడం, కూడికలు-తీసివేతలు చేయడం, గణిత గుర్తులు గుర్తుంచుకోవడం, రోజువారీ లెక్కల్ని సాధించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయి. మ్యాథ్స్ ఫోబియా (గణిత భయం) అనేది కేవలం లెక్కల పట్ల ఉండే భయం, ఒత్తిడి లేదా ఆందోళన మాత్రమే.ఈ భయం వల్ల పరీక్షల సమయంలో ఏకాగ్రత తగ్గి మార్కులు తక్కువ రావచ్చు, కానీ ఒత్తిడి లేనప్పుడు వీరు లెక్కల్ని అర్థం చేసుకోగలరు. అయితే, డిస్కాల్క్యులియా ఉన్నవారికి అన్ని సమయాల్లోనూ, అన్ని పరిస్థితుల్లోనూ సంఖ్యలను అర్థం చేసుకోవడం కష్టంగానే ఉంటుంది. ఒకే వ్యక్తిలో డిస్కాల్క్యులియా, గణిత భయం రెండూ ఉండొచ్చు, కానీ ఇవి రెండూ వేర్వేరు సమస్యలని నిపుణులు తెలిపారు. అంతేకాకుండా ఈ సమస్య గురించి పూర్తి వివరాల్ని అందించారు.**





### పిల్లల్లో:

అంకెలను గుర్తించడం, లెక్కించడం నేర్చుకోవడంలో ఇబ్బంది. పరిమాణాల్నిపోల్చలేకపోవడం (ఏది పెద్దది, ఏది చిన్నది). సాధారణ లెక్కలను గుర్తుంచుకోలేకపోవడం. అనలాగ్ గడియారంలో సమయం చూడలేకపోవడం. అంకెలతో కూడిన సూచనలను పాటించడంలో గందరగోళం. క్లాస్‌లోని తోటి పిల్లల కంటే సాధారణ లెక్కలు చేయడానికి వీరు ఎక్కువ సమయం తీసుకుంటారు.

### పెద్దవారిలో:

చిల్లర లెక్కలు చేయడం, బిల్లులు చెల్లించడం, పరిమాణాల్ని అంచనా వేయడం, శాతాలు (పర్సంటేజీలు) లెక్కించడం, బడ్జెట్, షెడ్యూల్స్ నిర్వహించడంలో తీవ్ర సమస్యలు వస్తాయి. పెద్దవారు ఈ సమస్యను దాచిపెట్టేందుకు లేదా ఎదుర్కొనేందుకు సొంత మార్గాల్ని అలవర్చుకోవడం వల్ల ఈ సమస్య చాలా ఏళ్లపాటు బయటపడకపోవచ్చు. అయితే, అప్పుడప్పుడు లెక్కల్లో పొరపాట్లు జరగడం డిస్కాల్క్యులియా కిందకు రాదు.

**అనలాగ్ గడియారంలో సమయం చూసి చెప్పడం కష్టం కావచ్చు.**
**ఒక ప్రదేశానికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో అంచనా వేయలేకపోవడం.**
**ముఖ్యమైన తేదీలు, ఫోన్ నంబర్లు, ఇంటి చిరునామాలు గుర్తుంచుకోవడంలో ఇబ్బంది.**
**దుకాణాల్లో డిస్కౌంట్లు లెక్కించడం, బిల్లులు సరిచూసుకోవడం, వంట చేసేటప్పుడు కొలతలు అర్థం చేసుకోవడం కష్టమవుతుంది.**
**వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయాల్లో ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని, స్వతంత్రతను దెబ్బతీస్తుంది.**

ఖచ్చితమైన కారణం పూర్తిగా తెలియనప్పటికీ సంఖ్యలు, గణిత సమాచారాన్ని ప్రాసెస్ చేసే మెదడులోని నాడీ వ్యవస్థలో ఉండే తేడాల వల్ల ఇది వస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. కుటుంబంలో ఎవరికైనా ఇలాంటి అభ్యాస లోపాలు ఉంటే, తర్వాతి తరానికి వచ్చే అవకాశం ఉన్నందున జన్యువులు కూడా కొంత పాత్ర పోషిస్తాయి. అయితే, కుటుంబంలో ఒకరికి ఉన్నంత మాత్రాన పిల్లలందరికీ వస్తుందని కాదు. డిస్కాల్క్యులియా అనేది బద్ధకం, తక్కువ తెలివితేటలు లేదా శ్రద్ధ లేకపోవడం వల్ల వచ్చేది కాదు. ఇది ఒక సహజమైన న్యూరోలాజికల్ సమస్య.

**దీనిని వైద్యపరంగా ఎలా నిర్ధారిస్తారు?**
దీనికి ఒకే ఒక సాధారణ పరీక్ష ఉండదు. సైకాలజిస్ట్, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ లేదా న్యూరోసైకాలజిస్ట్ ద్వారా సమగ్ర మూల్యాంకనం చేస్తారు.
**గణిత నైపుణ్యాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా సరళిని పరీక్షిస్తారు.**
వయసుకు తగిన గణిత ప్రమాణాలు ఉన్నాయా లేదా అని నిర్ధారించే ప్రామాణిక పరీక్షలు నిర్వహిస్తారు. చిన్నతనంలో ఎదుగుదల హిస్టరీ, పాఠశాల పనితీరు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిశీలనల్ని పరిగణనలోకి తీసుకుంటారు. సరైన బోధన లేకపోవడం, దృష్టి లోపాలు లేదా సాధారణ భయం వల్ల కాకుండా ఇది డిస్కాల్క్యులియానే అని నిర్ధారించడానికి ఈ పరీక్షలు తోడ్పడతాయి.

**దీనికి చికిత్స ఉందా? ప్రత్యేక శిక్షణతో తగ్గించవచ్చా?**
**డిస్కాల్క్యులియా అనేది జీవితాంతం ఉండే స్థితి. దీనిని శాశ్వతంగా నయం చేయడానికి ఎలాంటి మందులు లేదా నిర్దిష్ట చికిత్సలు లేవు. కానీ ప్రారంభంలోనే గుర్తించి ప్రత్యేక బోధన, శిక్షణ ఇవ్వడం ద్వారా దీనిని సమర్థవంతంగా అధిగమించవచ్చు.**
**విజువల్ మెటీరియల్స్, సంఖ్యా రేఖలు , వస్తువులు, ప్రాక్టికల్ ఉదాహరణలతో నేర్పించాలి.**
**పిల్లలకు అదనపు సమయం ఇవ్వడం, కాలిక్యులేటర్లు వాడటానికి అనుమతించడం, లిఖితపూర్వక సూచనలు ఇవ్వడం చేయాలి.**
**పెద్దవారు మొబైల్ యాప్‌లు, బడ్జెట్ టూల్స్, క్యాలెండర్ రిమైండర్లు, కాలిక్యులేటర్లను ఉపయోగించి రోజువారీ పనుల్ని సులభతరం చేసుకోవచ్చు.**

# హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్.. ప్రేక్షకులనే నిందిస్తూ మేకర్స్ తప్పించుకుంటున్నారా?



సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది.

సినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది.


సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది. అలా క్రమంగా సినిమా కథ, కళ, నటన వంటి అంశాలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అభిప్రాయపడింది. కరోనా మహమ్మారికి ముందు సినీ పరిశ్రమ మంచి మార్పు దిశగా పయనించిందని తాప్సీ చెప్పింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొన్ని పాత పద్ధతులు తిరిగి వస్తున్నాయని ఆమె అభిప్రాయపడింది.

సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే దానికి ప్రేక్షకుల అభిరుచులను కారణంగా చూపుతూ మేకర్స్ తప్పించుకునే పరిస్థితి ఉందని తాప్సీ వ్యాఖ్యానించింది. నటీనటులు పరిశ్రమలో మార్పు కోసం ఎంత ప్రయత్నించినా.. ప్రేక్షకుల నుంచి మద్దతు లేకపోతే ఆ పోరాటంలో విజయం సాధించడం కష్టమని ఆమె చెప్పుకొచ్చింది.

# 'రంగస్థలం' తర్వాత మళ్లీ అదే కాంబో.. RC17కి కొబ్బరికాయ కొట్టేది ఎప్పుడంటే..!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ అంటేనే సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉంటాయి. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఎలాంటి సంచలన విజయాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ అద్భుతమైన నటన, సుకుమార్ టేకింగ్, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం కలిసి ఆ సినిమాను ఇండస్ట్రీ హిట్‌గా నిలబెట్టాయి. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో మరో భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనుండటంతో మెగా అభిమానుల్లో ఎప్పటినుంచో ఆసక్తి నెలకొంది. రామ్ చరణ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఒకటిగా భావిస్తున్న ఈ సినిమాకు ప్రస్తుతం 'RC17' అనే వర్కింగ్ టైటిల్‌తో వ్యవహరిస్తున్నారు. 'RC17'కు సంబంధించి ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చినప్పటికీ.. సినిమా రెగ్యులర్ షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై కొంతకాలంగా ఆసక్తి కొనసాగుతోంది. 'పెద్ది' షూటింగ్ సమయంలో రామ్ చరణ్ చేతికి గాయం కావడం, అనంతరం సర్జరీ జరగడంతో ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో RC17 షూటింగ్ ఆలస్యం అవుతుందనే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. రాబోయే దసరా సందర్భంగా ఈ సినిమాకు గ్రాండ్‌గా ముహూర్త కార్యక్రమాలు నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేలా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ తేదీలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.







# 'కొరియన్ కనకరాజు' ఓటీటీ ఎంట్రీ.. వరుణ్ తేజ్ హిట్ మూవీ

ఈ ఏడాది టాలీవుడ్‌లో పలువురు హీరోలు సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. ఆ లిస్ట్‌లో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కూడా ఉన్నారు. కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్‌కు 'కొరియన్ కనకరాజు' మంచి విజయాన్ని అందించింది. హారర్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి ఫలితాన్ని అందుకుంది. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించారు . విభిన్నమైన కథ, కామెడీ, హారర్ అంశాలను కలగలిపి తెరకెక్కించిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. థియేటర్లలో కూడా అదే జోరును కొనసాగిస్తూ మంచి విజయాన్ని అందుకుంది. థియేట్రికల్ రన్‌ను పూర్తి చేసుకున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను పలకరిం చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటు లోకి వచ్చింది.

తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల ఆడియన్స్‌ను కూడా టార్గెట్ చేస్తూ మొత్తం ఐదు భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవు తోంది. దీంతో థియేటర్లలో ఈ సిని మాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి నుంచే చూసే అవకాశం దక్కింది. వరుణ్ తేజ్ గత కొంతకా లం గా విభిన్నమైన కథలను ఎంచు కుంటూ వస్తున్నారు. అయితే ఆశించిన స్థాయి లో వరుస విజయాలు మాత్రం దక్క లేదు. ఈ నేపథ్యంలో 'కొరియన్ కనకరాజు'తో వచ్చిన సక్సెస్ ఆయన అభిమానులకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది.



# 140కిలోలు ఎత్తి ఇంటర్నెట్ సెన్సేషన్.. ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన




సంచలన ప్రదర్శనతో భారత క్రీడాభిమానులను ఆకట్టుకున్న కేయా బెనర్జీకి ఆన్‌లైన్ వేధింపులు ఎదురయ్యాయి. స్వయంగా ఆమే తన ఆవేదనను వెల్లడించింది. ఇటీవలే ఐపీఎఫ్ వరల్డ్ సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కేయా రజతం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 140 కిలోలు ఎత్తింది. కేవలం 21 ఏళ్ల వయసులో తన బరువు కంటే మూడున్నర రెట్లు అధికంగా లిఫ్ట్ చేసిందని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, కొందరు తన చిత్రాలను అసభ్యకరంగా మార్చి వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఆమె వాపోయింది. ఈ మేరకు తన కొత్త ఖాతా నుంచి సుదీర్ఘమైన పోస్టు పెట్టింది.

"హాయ్.. నేను చేసిన ఈ పోస్టును చదివేందుకు ఆగినందుకు కృతజ్ఞతలు. నేను ఇటీవలే ఛాంపియన్‌షిప్‌లో (IPF World Powerlifting Championships) సిల్వర్ మెడల్ సాధించాను. నా కష్టాన్ని గుర్తించి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. అయితే, ఓ భారత మహిళా అథ్లెట్‌గా నేను ఆన్‌లైన్‌లో ఎదురైన లైంగిక వేధింపులతో పోరాడా. సోషల్ మీడియా నాపేరు మీద ఫేక్ ఖాతాలను చూశా. నా జాతి, వంశం, కులానికి సంబంధించి చెత్త సంభాషణలు ఇంకా కలవరానికి గురి చేస్తున్నాయి. నా శరీరం, ముఖాన్ని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన వేలాది ఏఐ జనరేటెడ్ ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది.

నేనెప్పుడూ నా వ్యక్తిగత ఖాతాల నుంచి ఫొటోలను షేర్ చేయను. ప్రైవేట్ పర్సన్‌గానే ఉండేందుకు ఇష్టపడతా. నా పాత అకౌంట్స్‌లోనూ అలాంటి ఉండవు. జీవితంలో క్రీడలను ఎంచుకోవడానికి కారణం సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగడమే నా లక్ష్యం. అయితే, ప్రతి రోజూ నిద్రలేవగానే నా ఫీడ్ అంతా ఈ నకిలీ ఏఐ చిత్రాలతోనే నిడిపోవడంతో అసహనం కలుగుతోంది. నా పాత అకౌంట్‌ను ఇప్పటికే ఇన్‌స్టా సస్పెండ్ చేసింది. అందులో కేవలం 300 మంది ఫాలోవర్లు మాత్రమే ఉన్నారు. ఇప్పుడు కొత్త అకౌంట్ నుంచి ఈ పోస్టు పెడుతున్నా. దీనిని కూడా బహిర్గతం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. క్రీడల్లో నేను సాధించిన విజయాలను మాత్రమే ప్రస్తావించాలని భావించా. అయితే, నా ఖాతా మళ్లీ సస్పెండ్ కాకుండా ఉండేందుకే నా పక్షాన నేను నిలబడేందుకు నాకు వేరే మార్గం కనిపించడం లేదు. అందుకే, ఇప్పుడు ఈ విషయాలను వెల్లడించా" అని కేయా బెనర్జీ తన పోస్టులో పేర్కొంది.

# సూపర్ స్మృతి

ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు మరో ఘనవిజయంతో సెమీస్ బెర్తును చేజిక్కించుకుంది. గురువారం గ్రూప్-ఎలో హర్మన్‌ప్రీత్ సేన 137 పరుగుల తేడాతో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. మొదట ఓపెనర్ స్మృతి మంధాన (124; 64 బంతుల్లో 14×4, 7×6) సూపర్ సెంచరీతో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. షెఫాలి (28; 17 బంతుల్లో 3×4, 2×6)తో తొలి వికెట్‌కు స్మృతి 74 పరుగులు జోడించింది. అనంతరం దీప్తి శర్మ (3/9), నందని శర్మ (2/6), ప్రేమ రావత్ (2/12), శ్రీచరణి (2/16) విజృంభించడంతో హాంకాంగ్ 16.2 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో నటాషా మైల్స్ (15), మెరీనా లాంప్లగ్ (14), యాస్మిన్ దస్వాని (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. నందని వేసిన రెండో ఓవర్లో మరికో హిల్ (0) డకౌట్ కాగా.. కెప్టెన్ నటాషా, యాస్మిన్ ఇంకో 7 ఓవర్లు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. కానీ తొమ్మిదో ఓవర్లో యాస్మిన్‌ను దీప్తి ఔట్ చేశాక వికెట్ల పతనానికి గేట్లెత్తేసినట్లయింది. చివరి 9 వికెట్లను 27 పరుగుల వ్యవధిలో కోల్పోయిన హాంకాంగ్.. 22 బంతులుండగానే ఇన్నింగ్స్‌ను ముగించింది. ఆఖరి 6 వికెట్లయితే కేవలం 4 పరుగుల తేడాలోనే పడ్డాయి. శనివారం భారత్.. తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొంటుంది.

ప్రేమ రావత్ 2/12

మంధాన ధనాధన్: భారత్ స్కోరు 193 పరుగులైతే.. మిగతా బ్యాటర్లంతా కలిసి సాధించింది 62 మాత్రమే. కానీ స్మృతి మాత్రం ఇతర బ్యాటర్లు సాధించిన మొత్తం పరుగుల కంటే రెట్టింపు స్కోరు చేయడం విశేషం. మొత్తం స్కోరులో దాదాపుగా మూడింట రెండొంతుల పరుగులు ఆమెవే. థాయ్‌లాండ్‌పై 19 పరుగులే చేసిన స్మృతి.. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి చక్కటి షాట్లతో అదరగొట్టింది. మరో ఓపెనర్ షెఫాలి వర్మ తనదైన శైలిలో చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. పవర్ ప్లేలో భారత్ వికెట్ నష్టపోకుండా 60 పరుగులు చేసింది. టోర్నీలో మరో అర్ధశతకం సాధించేలా కనిపించిన షెఫాలి.. రుచిత వేసిన 8వ ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటైంది. ఆ తర్వాత అవతలి ఎండ్ నుంచి స్మృతికి పెద్దగా సహకారం అందలేదు. ప్రతీక రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్‌ప్రీత్ (10) మరోసారి నిరాశపరిచారు. అయినా థాయ్‌తో మ్యాచ్‌లో మాదిరి భారత్ ఓ మోస్తరు స్కోరుతో సరిపెట్టుకోలేదంటే కారణం స్మృతినే. అవతలి ఎండ్‌లో ఏం జరిగినా పట్టించుకోకుండా ఆమె తనదైన శైలిలో ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయింది. 40 బంతుల్లో అర్ధశతకం సాధించిన స్మృతి.. ఇంకో 17 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకోవడం విశేషం. సెంచరీ తర్వాత ఆమె జోరు ఇంకా పెరిగింది. మరో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టింది. చివరి ఓవర్లో మూడో బంతికి మంధాన రనౌటవడంతో భారత్ 200 మార్కును అందుకోలేకపోయింది.

రికార్డుల రాణి

భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఒకే రోజు రెండు గొప్ప రికార్డులను ఖాతాలో వేసుకుంది. మహిళల క్రికెట్లో అత్యధిక పరుగులు, శతకాలు సాధించిన బ్యాటర్‌గా ఆమె ప్రపంచ రికార్డులు నమోదు చేసింది. ఆదివారం హాంకాంగ్‌పై సాధించిన శతకం (124)తో స్మృతి అంతర్జాతీయ పరుగులు 10,880కి చేరుకున్నాయి. భారత దిగ్గజ బ్యాటర్ మిథాలి రాజ్ (10,868)ను ఆమె అధిగమించింది. స్మృతి వన్డేల్లో 5411, టీ20ల్లో 4681, టెస్టుల్లో 788 పరుగులు సాధించింది. మరోవైపు అత్యధిక అంతర్జాతీయ శతకాలు (18) సాధించిన మహిళగానూ ఆమె ఘనత సాధించింది. మెగ్ లానింగ్ (ఇంగ్లాండ్-17), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా-17)లను స్మృతి అధిగమించింది.



భారత్ ఇన్నింగ్స్: స్మృతి రనౌట్ 124; షెఫాలి (సి) మెరీనా (బి) రుచిత 28; ప్రతీక (సి) బిబి (బి) జాయ్‌లీన్ 10; రిచా ఘోష్ (సి) అండ్ (బి) మెరీనా 11; హర్మన్‌ప్రీత్ (సి) జాయ్‌లీన్ (బి) మెరీనా 10; భార్తీ ఫుల్మాలి నాటౌట్ 2; దీప్తి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 193; వికెట్ల పతనం: 1-74, 2-111, 3-151, 4-185, 5-190; బౌలింగ్: ఇక్రా సహర్ 4-0-28-0; కేరీ చాన్ 3-0-28-0; మెరీనా 4-0-46-2; మరియం బిబి 2-0-29-0; అలిసన్ సియు 3-0-19-0; రుచిత వెంకటేశ్ 2-0-30-1; జాయ్‌లీన్ కౌర్ 2-0-12-1

హాంకాంగ్ ఇన్నింగ్స్: నటాషా (సి) రిచా (బి) ప్రేమ 15; మరీకో (బి) నందని 0; యాస్మిన్ (సి) భార్తీ (బి) దీప్తి 11; కేరీ చాన్ (సి) షెఫాలి (బి) ప్రేమ 1; మెరీనా (సి) ప్రతీక (బి) శ్రీచరణి 14; మరియం బిబి (సి) షెఫాలి (బి) నందని 7; షంజీన్ (స్టంప్డ్) రిచా (బి) శ్రీచరణి 2; సియు (బి) దీప్తి 1; ఇక్రా (సి) రిచా (బి) దీప్తి 0; జాయ్‌లీన్ రనౌట్ 1; రుచిత నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (16.2 ఓవర్లలో ఆలౌట్) 56; వికెట్ల పతనం: 1-2, 2-29, 3-31, 4-36, 5-52, 6-54, 7-55, 8-55, 9-56; బౌలింగ్: క్రాంతి గౌడ్ 3-1-5-0; నందని శర్మ 3-0-6-2; షెఫాలి 1-0-4-0; శ్రీ చరణి 3.2-0-16-2; దీప్తి శర్మ 3-0-9-3; ప్రేమ రావత్ 3-0-12-2

# సచిన్ లాంటి కెరీర్‌ను సూర్యవంశీ నిర్మించుకోవాలి

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రశంసల వర్షం కురిపించారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌లా అద్భుతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఏదో ఒక సిరీస్ లేదా ఒక సంవత్సరంలో మాత్రమే కన్పించే వండర్ ప్లేయర్‌గా మారకూడదన్నారు. గురువారం బీసీసీఐ రివ్యూ మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం సైకియా విలేకర్లతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ ప్రస్తావననూ తీసుకొచ్చారు. "ఓ 15 ఏళ్ల కుర్రాడిని అంతర్జాతీయ క్రికెట్‌లోకి తీసుకొచ్చినందుకు బీసీసీఐ గర్వపడుతోంది. అతడి సత్తా ఏంటో ఇప్పటికే అభిమానులకు చూపించాడు. ముమ్ముందూ ఇలానే సరైన మార్గంలో సాగాలని కోరుకుంటున్నా. కొన్ని మ్యాచులకే పరిమితం కాకుండా.. సుదీర్ఘమైన కెరీర్‌ను నిర్మించుకోవాలి. అందుకు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను వైభవ్ ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జాతీయ కెరీర్‌లో అతడు వేసే ప్రతి అడుగును అన్ని కోణాల నుంచి నిశితంగా గమనిస్తూనే ఉంటాం. వైభవ్ భవిష్యత్తుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టిసారించింది" అని సైకియా వెల్లడించారు.



సఫారీలతో వన్డే సిరీస్ ?

ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే, వరల్డ్ కప్ ముంగిట సఫారీ జట్టుతో సిరీస్ ఆడితే బాగుంటుందనేది భారత జట్టు ఆలోచన. ఇదే విషయమై మేనేజ్‌మెంట్ కూడా దక్షిణాఫ్రికా బోర్డుతో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వన్డే సిరీస్‌లో కనీసం నాలుగు నుంచి ఆరు మ్యాచులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలోనూ బోర్డు కఠినంగా ఉండనుంది. రివ్యూ మీటింగ్‌లో ఇదే ప్రధాన అంశంగా చర్చించినట్లు సమాచారం.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945